VISALAANDHRA VIJAYAWADA Phone No. 176

4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డునెం A 193

భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో 'రెడ్ స్టార్' వ్యాసం

మాస్కో, ఆగస్టు 14

"భారత జాతీయ ఆర్థిక వ్యవస్థ నానాటికి బలపడుతూన్నకొద్దీ, వలసవిధానానికి వ్యతిరేకంగా రాజకీయ ఆర్థికరంగాలలో సాగుతూన్న పోరాటంలో భారతదేశం మరింత ప్రముఖపాత్రను నిర్వహిస్తూంది" అని సోవియట్ సైనికశాఖ పత్రిక 'రెడ్ స్టార్' భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో ఒక ప్రత్యేక వ్యాసం రాస్తూ అన్నది.

విశాలాంధ్ర

70606 9

సంపుటి 7 • విజయవాడ శనివారం శ్రావణం 25-1880 [ఆగస్టు 16-1958] • సంచిక 147

కమ్యూనిస్టు దేశాలకు ఎగుమతులు

బ్రిటిష్ వర్తకశాఖ ప్రకటన

లండన్, ఆగస్టు 15

కమ్యూనిస్టు దేశాలకు ఎగుమతి చేయకూడదన్న నిషేధం క్రింద ఇంతవరకున్న సరకుల్లో నూరింటి వస్తువులను నిషేధంనుండి తొలగిస్తూ బ్రిటిష్ ప్రభుత్వ వర్తకశాఖ నేడొక ప్రకటన చేసింది.

స్వాతంత్ర్య రక్షణకూ, సోషలిజం సాధనకూ ప్రతిన బూనండి

భారత ప్రజలకు కేరళ ముఖ్యమంత్రి నంబూద్రిపాద్ స్వాతంత్ర్య దినోత్సవ సందేశం

సోదర అరబ్ దేశాల స్వాతంత్ర్యోద్యమాన్ని బలపర్చాలని విజ్ఞప్తి

తిరువనంతపురం, ఆగస్టు 15

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో మాతృదేశ స్వాతంత్ర్య రక్షణకు ప్రతినబూనటంతోపాటు, సోదర అరబ్ దేశాల స్వాతంత్ర్యోద్యమానికి అండగా నిలుస్తామనికూడా భారతీయులు శపథంచేయాలని కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ ఉద్బోధించారు.

ఈవేళ ఉదయం కేరళ యూనివర్సిటీ స్టేడియమ్‌లో జరిగిన "స్వాతంత్ర్య దినోత్సవ" విన్యాసాల సందర్భంలో శ్రీ నంబూద్రిపాద్ ప్రసంగిస్తూ, పైవిధంగా చెప్పారు. ముఖ్యమంత్రి పదవి స్వీకరించిన పిమ్మట శ్రీ నంబూద్రిపాద్ విన్యాసాలను తనిఖీ చేసి, సైనికవందనం స్వీకరించటం ఇదే మొదటిసారి.

భారతీయులు తమ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొంటున్న ఈ సందర్భంలో మాతృదేశ స్వాతంత్ర్యాన్ని సంరక్షించుకొంటూ, పటుతర మొనర్చటానికి ప్రతిన బూనాలి. దానితోపాటు సోదర దేశాలు, ముఖ్యంగా అరబ్ దేశాలు స్వాతంత్ర్యంకోసం సాగిస్తున్న పోరాటానికి అండదండగా నిలుస్తామనికూడా భారతీయులు శపథంచేయాలని శ్రీ నంబూద్రిపాద్ ఉద్బోధించారు.

జాతీయ స్వాతంత్ర్య దినోత్సవమైన ఈవేళ మనమంతా వ్యవసాయక, తదితర రంగాలలో ఉత్పత్తిని ఇతోధిక మొనర్చుతామనీ, సోషలిస్టు నమూనా సమాజాన్ని సాధిస్తామనీ కూడా ప్రతిజ్ఞ బూనాలని ఆయన చెప్పారు.

ఢిల్లీ-మాస్కోల మధ్య విమానసర్వీసుకు ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, ఆగస్టు 14

భారతదేశానికి సోవియట్ యూనియన్‌కూ మధ్య సరాసరి విమానసర్వీసును ప్రారంభించిన సందర్భంలో నేడుదయం ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్ వారి విమానంలో పార్లమెంటు సభ్యులు, పాత్రికేయులు, అధికారులు, పారిశ్రామిక వేత్తలు, ట్రావెల్ ఏజెంట్లూ మొత్తం 67 గురు మాస్కోకు బయలుదేరి వెళ్ళారు.

ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్ వారికి అతిథులుగా వెళ్ళిన ప్రయాణీకులు సోవియట్ యూనియన్‌లో ఒకవారంరోజులపాటు వుంటారు.

ఈ ప్రయాణీకుల బృందంలో పార్లమెంటు సభ్యుడు డాక్టర్ సుబ్రాయన్, మాజీ ఆరోగ్యశాఖామంత్రి రాజకుమారి అమృతకౌర్, కాంగ్రెసు పార్లమెంటరీపార్టీ కార్యదర్శి శ్రీ రామసుభాగ్ సింగ్, పారిశ్రామిక వేత్తలైన నవల్ టాటా, బాబుభాయిచినాయి, ఢిల్లీలోని పోలిష్ రాయబారి, అమృతబజార్ పత్రిక సంపాదకుడు శ్రీ తుషార్ కాంతిఘోష్, సోవియట్ యూనియన్‌లో భారత రాయబారి సతి శ్రీమతి కె. పి. యస్. మీనన్, భారత విదేశాంగ వ్యవహారాలశాఖ ప్రధాన కార్యదర్శి సతి శ్రీమతి యస్. ఆర్. పిళ్లై మొదలుగా గలవారంతా వున్నారు.

కార్మికుల సమ్మె యత్నం

ఏలూరు, ఆగస్టు 10

ఏలూరు బ్రాంచి హైవేస్ కార్మికులు ఈనెల 10 వ తేదీ శ్రీ ఎ. వి. సుబ్బారావు అధ్యక్షతను సమావేశమై 27 వ తేదీ సమ్మెను బలపరచాలని తీర్మానించారు.

ఏలూరు, చింతలపూడి తాలూకాలలోని గాలబుగూడెం, పోనపాన పల్లి, ధర్మాజిగూడెం, వట్లూరు, కొత్తూరు, పెదపాడు, భీమడోలు వగైరా గ్రామాలనుండి 40 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఏలూరు హైవేస్ వర్కుషాపులోని మెకానిక్కులు, రోలరు డ్రైవర్లు, క్లీనర్లు వగైరా స్టాఫు కూడా పాల్గొన్నారు.

దేశఐక్యతను, స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం

ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తూ ప్రధాని నెహ్రూ ప్రసంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 15

దేశ ఐక్యత, దేశ స్వాతంత్ర్యం - ఇవి రెండూ మనకు అత్యంత ప్రధానమైనవనీ, అవి లేకుండా భారతదేశం పురోగమించడం, సౌభాగ్యవంతం కావడం సాధ్యపడదనీ ప్రధాని నెహ్రూ నేడు ఎర్రకోట బురుజుపై నిలబడి మాట్లాడుతూ ఉద్ఘాటించారు.

భారతదేశ ఐక్యతను బలహీన పరచడానికి ఎవరు ఎలాంటి చర్యలు జరిపినా కఠినంగా అణచివేస్తామని కూడా ప్రధానమంత్రి అన్నారు.

భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో నేడుదయం ప్రధాని నెహ్రూ ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు.

శ్రీ నెహ్రూ తన అరగంటసేపటి ప్రసంగంలోనూ హెచ్చుభాగాన్ని దేశ అంతరంగిక వ్యవహారాలకే వినియోగించారు. గుజరాత్‌లోనూ దేశంలోని తదితర ప్రాంతాల్లోనూ జరుగుతున్న ఘటనలకు ఆందోళన వెలిబుచ్చారు.

ప్రధాని నెహ్రూ నేడుదయం చరిత్రాత్మకమైన ఎర్రకోట వద్దకు రాగానే ఢిల్లీ పౌరులతరఫున మేయర్ శ్రీమతి అరుణ అసఫ్‌అలీ స్వాగతమిచ్చారు. ఆ తరువాత ఆయన సైనిక వందనం స్వీకరించి, ఎర్రకోట బురుజు ఎక్కి జాతీయ పతాక ఆవిష్కరణ జరిపారు.

ప్రధానమంత్రి ఇంతకు ముందు స్వాతంత్ర్య వార్షికోత్సవం సందర్భంలో ఎర్రకోట బురుజునుండి ప్రసంగించినప్పుడల్లా భారతదేశం సాధించిన విజయాలను హెచ్చుగా ప్రస్తావించేవారు. కాని ఈసారి ఆయన ఆ విషయాన్ని పూర్తిగా వదలివేసి, దేశాన్ని ఎదుర్కొంటున్న ప్రమాదాలను గురించే హెచ్చుగా మాట్లాడారు.

పశ్చిమాసియాను గురించి శ్రీ నెహ్రూ క్లుప్తంగా ప్రస్తావించి విదేశ సైన్యాలు కొన్ని పశ్చిమ ఆసియాలో తిష్టవేసి వున్నాయన్నారు. ఉద్రిక్త వాతావరణం కొంతవరకు తగ్గిన సూచనలు కనపడుతున్నప్పటికీ ఆ ప్రాంతంలో పరిస్థితి ఇంకా ప్రమాదకరంగా వున్నదని శ్రీ నెహ్రూ పేర్కొన్నారు

"స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం తహతహలాడుతున్న అరబ్ ప్రజల వాంఛ అనతికాలంలోనే ఫలించగలదని మనమంతా ఆశించుదాం" అని శ్రీ నెహ్రూ అన్నారు.

ప్రజల దుస్థితిని అవకాశంగా తీసుకొని బ్లాక్‌మార్కెట్టుద్వారా అధికలాభాలను సంపాదించుకోజూస్తున్న సంఘవ్యతిరేక శక్తులను ప్రధాన మంత్రి తీవ్రంగా ఖండించారు. "వారంతా దేశానికి ద్రోహులని" ఆయన పేర్కొన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇప్పటికి 11 ఏండ్లు అయినప్పటికీ ఇంకా మన దేశములోని కొన్ని ప్రాంతాలలో కొట్లాటలూ, ఒకరి నొకరు చంపుకోవడం జరుగుతూనే వున్నదనీ, ఇందుకు తానెంతో బాధపడుతున్నాననీ ఆయనన్నారు.

అయితే ఈ సందర్భంలో తానెవరినీ నిందించడం లేదన్నారు. ఎవ్వరిపైనా ఫిర్యాదు చేయడంలేదన్నారు. మనవిధానాలు ఏవైనప్పటికీ అందరం కలిసి శాంతియుతంగా పనిచేసినప్పుడే విజయం సాధ్యపడగలదు. మనలోనే ఒకరితో మరొకరు పోట్లాడుకోవడంద్వారా మనశక్తిని వృధాచేసుకోరాదన్నారు.

ఏ సమస్యపైన అయినా అభిప్రాయ బేధముంటే ఒకరికొకరు నచ్చజెప్పుకోవడం ద్వారానే ఆసమస్యను పరిష్కరించుకోవాలి. అందువలన ఓర్పు, సహనం అవసరం అనే విషయాన్ని మనం గుర్తించాలి. పోట్లాటద్వారా మన నిర్ణయాలను రుద్దడానికి ప్రయత్నం చేసే భారతదేశంలో సోషలిజాన్ని గాని, స్వాతంత్ర్యాన్ని గాని నెలకొల్పలేమని మనమంతా గుర్తించాలి. బెదరింపులద్వారా, లేక, సాయుధబలం చూపి ఏఒక్క నిర్ణయాన్నీ ఇతరులపై మనం రుద్దడం సాధ్యంకాదు.

గుజరాత్‌లో అనేకచోట్ల కాల్పులు, లాఠీప్రయోగాలు

అహమ్మదాబాద్ కాల్పులకు పలు ప్రాంతాల్లో ప్రజల నిరసన

అహమ్మదాబాద్, ఆగస్టు 14

ఇక్కడకు 40 మైళ్ళ దూరంలో వున్న ఆనంద్‌లో అహమ్మదాబాద్‌లో జరిగిన కాల్పులకు నిరసనగా ప్రజలు రైల్వేలకు, ప్రభుత్వఆస్తికి నష్టంకలుగ జేసినట్లు ఇక్కడికివార్తలు చేరాయి.

అయిదువందలమందికిపైగా ప్రజలు రైల్వేస్టేషన్ వద్ద గుమిగూడి ఆనంద్ నుండి కాంబేకు వెళ్ళే రైలుపై దాడి చేశారు. పెట్టెలనుచాలవరకు ధ్వంసం చేశారు.

ఎర్రజెండాను వూపి వారు ఒక గూడ్సు బండిని ఆపివేశారు. ముందుకు ఆ రైలును వెళ్ళనీయలేదు. అక్కడ జరిగిన సంఘటన వివరాలు ఇంకా అందలేదు.

స్టేషన్‌లోవున్న పాల డిపోపై ప్రజలు దాడిచేశారని మరొక వార్త ఆనంద్ పట్టణంలో ఉద్రిక్తపరిస్థితులు ఏర్పడినాయి. ప్రజలు దళాలుగా ఏర్పడి ప్రదర్శనలు చేస్తున్నారు.

లాఠీచార్జీలు

ఖైరా జిల్లాలోని బోర్సాద్ పట్టణంలో ఒకచోట అయిదువందల మందికిపైగా గుమిగూడారు. వారిపై పోలీసులు లాఠీచార్జీ చేసినట్లు నేటి మధ్యాహ్నం యిక్కడికి వార్తలందాయి.

కాంగ్రెసుకమిటీ కార్యాలయంపై ప్రజలు రాళ్లు రువ్వారనీ, బస్సులు ఆగే షెడ్‌లను ధ్వంసం చేశారనీ కూడా వార్తలు అందాయి.

మహాల్స్ జిల్లాలోని గోద్రాలోనూ, పంచ్‌లోనూ ప్రజలు స్థానిక కాంగ్రెసుపార్టీ ఆఫీసులపై దాడులు చేశారు. మెహసానా జిల్లాలో సిద్ధపూర్‌లో పూర్తిగా హర్తాల్ జరిగింది. పెద్దప్రదర్శనలు కూడా

మిగతా 4 వ పేజీలో

మరో యువకుని మరణం

అహమ్మదాబాద్‌లో

అహమ్మదాబాద్, ఆగస్టు 15

నిన్న అహమ్మదాబాద్‌లోని మహాపూర్ ప్రాంతంలో జరిగిన పోలీసు కాల్పుల్లో గాయపడిన యువకుడు నేడుదయం మరణించినట్లు అధికారులు ప్రకటించారు.

జనతా పరిషత్ నాయకులు పెద్ద వూరేగింపులో ఆ యువకుని మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకొని వెళ్ళారు. వూరేగింపు సారాభాయి ఆసుపత్రినుండి ప్రారంభమైంది.

ఈవేళ ఉదయం ప్రారంభమైన స్వాతంత్ర్య దినోత్సవాలు ప్రభుత్వోద్యోగులకు మాత్రమే పరిమిత మయ్యాయి.

నేడు ప్రభుత్వం కర్ఫ్యూ ఉత్తర్వులను సడలించింది.

కేరళలో 'రాజకీయ హత్యల' నిజస్వరూపం

మలయాళీ వారపత్రిక వెల్లడి

('విశాలాంధ్ర' విలేఖరి)

తిరువనంతపురం, ఆగస్టు 14

కేరళలో "రాజకీయ హత్యలు" జరుగుతున్నాయంటూ కాంగ్రెసువారు, ఇతర ప్రతిపక్షాలు సాగిస్తూన్న ప్రచారాన్ని తీవ్రంగా నిరసిస్తూ "నవశక్తి" అనే మలయాళీ వారపత్రిక ఒక విచిత్రవుదంతాన్ని పేర్కొన్నది.

"నవశక్తి" సంపాదకుడు సుప్రసిద్ధ కాంగ్రెసువాది శ్రీ జి. రామన్ పిళ్ళై. ఆ పత్రిక ఆగస్టు 4వ తేదీ సంచికలో ఇలా వ్రాశారు:

"ఏమి చెప్పినా చెల్లుబడి అవుతున్న రోజు లివి. కమ్యూనిస్టుపార్టీ పేరుప్రతిష్టలు తగ్గిపోతున్నాయి. అందుచేత ప్రతిపక్షాలకు చెందిన పత్రికలు ఆ పార్టీపై అనేక ఆరోపణలు ప్రచారం చేస్తున్నాయి. తిరువనంతపురం జిల్లాలో నెయ్యాటింకర తాలూకాలోని సమాన్‌లో పద్మనాభపిళ్ళై అనేవ్యక్తి, శంకర పిళ్ళై అనే మరొకవ్యక్తిని చావ మోది, చంపేశాడు. చచ్చిపోయిన శంకరపిళ్ళెను హతాత్ముగా ప్ర. సో. పార్టీ నాయకుడుగా పత్రికలు చిత్రించటం మొదలు పెట్టాయి. నిజానికి వారిద్దరూకూడా త్రాగుబోతులు; రౌడీలు.

ఆరోజు ఉదయం మొదలుకొని సాయంత్రందాకా వారిద్దరూకలిసి తప్పత్రాగారు. సాయంత్రందాకా ఏవో చిన్నచిన్న విషయాలపై కీచులాడుకొన్నారు. సాయంత్రానికి నిషా బాగా తలకెక్కింది. అప్పుడు ఒక వ్యక్తి మరొకవ్యక్తిని చంపాడు. వారిద్దరిమధ్య అసలు రాజకీయ వైమనస్యం అంటూ లేనేలేదు. వారిద్దరూ ఒక రాజకీయ పార్టీకి చెందినవారనటం ఆ పార్టీకే తీరని కళంకం. వారిద్దరు-హత్య చేసినవ్యక్తి హత్యచేయబడిన వ్యక్తికూడా - పేరుమోసిన త్రాగుబోతులు, రౌడీలు [illegible]. చివరకు కేరళ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ దామోదరమీనన్ కూడా అసత్యాలతో కూడిన పత్రికా ప్రకటన చేశారు. పత్రికల పతనావస్థకు ఇది పరమస్థాయి. రాజకీయ నాయకుల సంగతి ఇక చెప్పనే అక్కర్లేదు."

* * *

జకార్తా, ఆగస్టు 13

ఇండొనేషియా అధ్యక్షుడు సోకర్నోని హత్యచేయడానికై పలుగురు యువకులు ప్రయత్నించారని, వీరిలో ముగ్గురికి ఉరిశిక్ష విధించబడిందని జకార్తా సైనిక న్యాయస్థానం వారు నేడొక ప్రకటనచేశారు.

అమెరికా అధ్యక్షునికి పిచ్చి ఆగ్రహావేశం

వాషింగ్టన్, ఆగస్టు 13

అమెరికా అధ్యక్షుడయిన ఐసెన్‌హోవర్ ఈవేళ పిచ్చెత్తిందా అన్నంత వెర్రికోపావేశాన్ని ప్రదర్శించారని అభిజ్ఞవర్గాలవలన తెలుస్తూంది. ఆ స్థితిలో ఆయనను చూచిన ఒక సెనేట్ సభ్యుడు, "ఇంత ఉన్మాదస్థితిలో అధ్యక్షుడిని నేనెన్నడూ చూడలేదు. నానాహంగామా చేశార"ని అన్నారు. ఆయన తన పేరునుమాత్రం బయట పెట్టవద్దన్నారు.

దీని కంతటికీ కారణం అమెరికాలో అణుయుద్ధోన్మాదం వేస్తున్న వెర్రితలలలో ఒక కొత్త పరిణామమే.

అణుయుద్ధం వస్తే అమెరికాకు కలిగే ఫలితాలను గురించి అమెరికా రక్షణశాఖకు చెందిన ఒక విజ్ఞాన శాస్త్ర సంఘం పరిశోధన జరిపి ఒక నివేదికను తయారుచేసి, రక్షణశాఖ ముందుంచింది.

అణుయుద్ధంవస్తే అమెరికాలో లక్షలకొలది ప్రజలు చనిపోవడం తథ్యం అన్నది ఈ నివేదికలో ఒక అంశం. ఎక్కడెక్కడ ఎంతెంతమంది చనిపోవచ్చునో వివరంగా ఒక జాబితారూపంలోనే ఈ సంఖ్యను నివేదిక ఉదహరించింది.

అణుయుద్ధంలో అమెరికా శత్రువులకు లొంగిపోవడం జరగవచ్చునని ఈ నివేదికలో తెల్పారు.

ఇలాంటి నివేదిక ఒకటి తయారయి, రక్షణశాఖ ముందుకు వచ్చిందనీ, రక్షణశాఖ దానిని పరిశీలిస్తున్నదనీ అధ్యక్షులు ఐసెన్‌హోవర్‌కు తెలిసింది.

ఈ వార్త వినడంతోనే ఐసన్‌హోవర్ మండిపడ్డారు. పిచ్చెత్తినంత పనిఅయి, నానాహంగామా చేశారని నేడు వెల్లడి అయింది.

ఈ నివేదిక ఉదంతం గురించి ఆమూలాగ్రం దర్యాప్తు జరుపవలసిందిగా ఐసెన్‌హోవర్ ఆజ్ఞాపించారని రక్షణశాఖోద్యోగి ఒకరు తెలిపారు.

అధ్యక్ష కార్యాలయంనుండి నిన్న ఒక ఉత్తరువు వచ్చిందనీ, దానితో సైనికశాఖలకు చెందిన కార్యకలాపాలన్నీ రెండు గంటలపాటు పూర్తిగా స్తంభించి పోయాయనీ కూడా ఆ అధికారి తెలిపారు.

గూడ్సుబండికి ప్రమాదం

విజయవాడ, ఆగస్టు 15

నేటి తెల్లవారుజామున మద్రాస్, కలకత్తాలైనుమీదనున్న కొలనుకొండ స్టేషన్‌వద్ద ఒక గూడ్సుబండికి జరిగిన ప్రమాదంవల్ల వాగన్ పట్టాలుతప్పింది. ఈ కారణంగా మద్రాస్ మెయిల్ ఇక్కడకు ఆరుగంటలు ఆలస్యంగా వచ్చింది. జి. టి., జనతా బండ్లు కృష్ణా కెనాల్‌లో ఆపివుంచారు. ప్రమాద స్థలానికి డివిజనల్ సూపరింటెండెంటు శ్రీ ఎం. ఎస్. మూర్తి వెంటనే వెళ్ళి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐక్ కొత్త పథకానికి అరబ్బుదేశాల నిరాకరణ

కైరో, ఆగస్టు 14

పశ్చిమాసియాలో "శాంతి, స్వాతంత్ర్యాల" సంరక్షణకంటూ ఐసన్‌హోవర్ నిన్న ఐరాస ముందుంచిన ఆరుసూత్రాల పథకాన్ని ఈజిప్టు పత్రికలన్నీ కూడా నేడు తీవ్రంగా ఖండించాయి.

"ఇది రెండవ ఐక్ పశ్చిమాసియా పథకం" అని 'అల్ అహ్రామ్' పత్రిక పతాక శీర్షికఇచ్చి దీనిని ఖండించింది.

"పశ్చిమాసియాలో దురాక్రమణను ఐసన్‌హోవర్ సమర్థిస్తున్నాడ"ని 'అల్ షాబ్' పత్రిక శీర్షిక పెట్టింది.

"తనదేశం బాహాటంగా ఒడిగట్టిన దురాక్రమణను సమర్థించుకోవడంలో ఐసెన్‌హోవర్ అసత్యాలు చెప్పడానికి కూడా ఒడిగట్టకుండా వుంటే బాగుండేద"ని 'అల్ అహ్రామ్' సంపాదకీయంలో విమర్శించింది.

"లెబనాన్ నుండి అమెరికా సేనలు ఏ తేదీని పూర్తిగా వైదొలగుతాయో ఐసన్‌హోవర్ పేర్కొనలేదు. ఈ విషయాన్నిబట్టి చూస్తే ఆయన పథకానికి విలువేమీ లేకుండా పోతుంది"ని 'అల్ అఖ్బార్' సంపాదకీయంలో ఖండించింది.

"పశ్చిమాసియాకు ఆర్థిక సహాయం" అంటూ ఐసెన్‌హోవర్ ఏమో అన్నారు. కాని పశ్చిమాసియా దేశాలు సైనిక దురాక్రమణనుగురించే ఆగ్రహంగా వున్నాయి గాని ఆర్థికపరిస్థితినిగురించి అంతగా లేద"ని ఆ పత్రిక స్పష్టంచేసింది.

అణుశాస్త్రవేత్త జోలియో క్యూరీ అస్తమయం

ప్రపంచశాంతి సాధనకై అశేష కృషిచేసిన యోధుడు

పారిస్, ఆగస్టు 14

ప్రపంచశాంతి సమితి అధ్యక్షులు, సుప్రసిద్ధ ఫ్రెంచి అణుశాస్త్రవేత్త అయిన జోలియోక్యూరీ గత రాత్రి అస్తమించారు. రక్తనాళం పగలడంవల్ల ఆయన మరణించారని హాస్పిటల్ అధికారులు తెలిపారు.

జీన్ ఫ్రెడెరిక్ జోలియో క్యూరీ వయసు 58 సంవత్సరాలు. ఆయనా, ఆయనభార్య ఐరీన్ క్యూరీ - ఇద్దరూ కూడా ప్రముఖ అణుశాస్త్ర పరిశోధకులు. రేడియో ధార్మిక శక్తిని కృత్రిమంగా కూడా సృష్టించవచ్చునని విషయాన్ని వీరిద్దరూ కలిసి పరిశోధనలు చేసి కనిపెట్టారు. అందుకు వీరిద్దరికీ 1935 లో నోబెల్ బహుమతిని ఇచ్చారు.

జోలియో ఫ్రెంచి విజ్ఞానశాస్త్ర పరిషత్తు సభ్యుడుగానూ, ఫ్రెంచి అణుశక్తి కమిషన్ అధ్యక్షుడుగానూ చాలకాలం ఉండేవారు. ప్రపంచ శాంతిసమితి అధ్యక్షుడుగా ఎన్నికయి, శాంతిఉద్యమంలో ప్రధాన పాత్రను నిర్వహించడంతో ఆ రెండు స్థానాల్నుంచీ ఆయనను తొలగించారు. కొరియా యుద్ధం రోజుల్లో అమెరికావారు ఒడిగట్టిన విషక్రిమి ప్రయోగం విషయమై ఈయనకూ, అమెరికా శాస్త్రజ్ఞులకూ తీవ్రమైన వాదోపవాదాలు జరిగాయి.

ప్రపంచ శాంతిసాధనకై చేసిన సేవకు ఆయన స్టాలిన్ శాంతి బహుమతిని పొందారు.

ఈయనభార్య ఐరీన్‌క్యూరీ రెండేళ్ల క్రితమే చనిపోయింది. రేడియమ్‌ని కనిపెట్టి ప్రపంచంలో శాశ్వత కీర్తి ఆర్జించుకొన్న పియరీ, మేరీ క్యూరీ దంపతుల కుమార్తె ఆమె. ఆ దంపతుల శిష్యుడే జోలియో. తరువాత ఆయన వారి అల్లుడయి, సుప్రసిద్ధులైన క్యూరీ దంపతుల ఇంటిపేరును తానుకూడా స్వీకరించాడు.

భారత కాలమానం ప్రకారం గత రాత్రి పదిన్నర గంటలకు పారిస్‌లో ఒక ఆసుపత్రిలో ఆయన కన్నుమూశారు. రక్తనాళం పగిలి చనిపోయారన్న విషయం మినహా ఆసుపత్రి అధికారులు మరే వివరాలూ తెలుపలేదు.

నలుగురు కమ్యూనిస్టు ఖైదీల విడుదల

హైదరాబాద్, ఆగస్టు 14

నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు కమ్యూనిస్టు ఖైదీలను ఆంధ్ర ప్రభుత్వం ఈవేళ విడుదల చేసింది. వారి పేర్లు ఇవి: పి. శంకరయ్య, వి. అచ్యుతం, జి. లింగారెడ్డి, వల్లభదాసు వెంకులు.

శ్రీ పి. శంకరయ్యకు 20 సంవత్సరాలు, మిగతా ముగ్గురికి యావజ్జీవ కారాగారవాసం తెలంగాణా పోరాట కాలంలో శిక్షలు విధించ బడినవి.

ఇంకా 8 మంది కమ్యూనిస్టు ఖైదీలు దీర్ఘకాల జైలు శిక్షను అనుభవిస్తున్నారు.

విళంబినామ సంవత్సర
చాంద్రమాన
శ్రావణమాసం
శుద్ధ పాడ్యమి ఉ॥ 7-38
విదియ తె. 5-47

విశాలాంధ్ర

శనివారం 16-8-58
శకమాన శ్రావణం 25-1880

ప్రజాస్వామికంగా పరిష్కరించండి!

ఆగస్టు పదిహేను స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో ప్రధానమంత్రి పండిత నెహ్రూ గాంధీజీ అహింసా సూత్రాలను స్మరణకు తెచ్చారు. కాని దురదృష్టవశాత్తు అదే సమయాన గాంధీజీని కన్నభూమి గుజరాత్ పోలీసు లాఠీఛార్జీలు, బాష్పవాయు ప్రయోగాలు, తుపాకి కాల్పులతో తల్లడిల్లిపోతోంది. హర్తాళులు జరిపి, ప్రభుత్వ ఆఫీసుల్ని ముట్టడించి ప్రజలు తమ అసమ్మతిని అనేక రూపాల్లో తెలియజేస్తున్నారు.

ఈ కల్లోలానికి కారకులెవ్వరు? గాంధీజీ పేరు చెప్పి బాధ్యతను గుజరాత్ ప్రజలమీదికి నెట్టడం ప్రధానమంత్రికి భావ్యమా?

ముక్క చెక్కలుగానున్న గుజరాత్ భూభాగాన్నంతటినీ కలిపి మహాగుజరాత్ ఏర్పడాలని 1920లో మొట్టమొదట సూచించిన వ్యక్తి మహాత్మాగాంధీ. స్వాతంత్ర్యం వస్తే ఆ కోర్కె నెరవేరుతుందని ప్రజలు నమ్మినారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలను దేశమంతటా ఏర్పరచడంతోపాటు తమ కోర్కెనూ నెరవేర్చమని గుజరాత్ ప్రజలు రాష్ట్ర పునర్విభజన సంఘాన్ని అర్థించారు. కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాన్ని త్రోసిరాజని మహారాష్ట్రీయుల్నీ, గుజరాతీయుల్నీ కలిపి బొంబాయి ద్విభాషా రాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అందుకు అసమ్మతిగా 1956 ఆగస్టులో వారం రోజులపాటు గుజరాత్ రాష్ట్రమంతటా హర్తాళులు, ప్రదర్శనలు కొనసాగాయి. శాంతియుతంగానున్న ప్రజలపై పోలీసులు ఆనాడూ కాల్పులు, లాఠీఛార్జీలు సాగించారు. కర్ఫ్యూ ఉత్తర్వులు, బాష్పవాయు ప్రయోగాలు విచ్చలవిడిగా కొనసాగాయి. అప్పటి కాల్పుల్లో 23 గురు నేలకొరిగారు. వందలకొలదీ గాయపడ్డారు. 2900 మంది జైలు నిర్బంధాలకు గురయ్యారు. అహమ్మదాబాద్ మేయరు, ఉపమేయర్లతోసహా 500 మంది కౌన్సిలర్లు రాజీనామాలిచ్చారు. దేశమంతటా 56 నవంబరు 1వ తేదీని భాషా ప్రయుక్తరాష్ట్రాలు ఏర్పడిన పర్వదినంగా జరుపుకుంటూంటే వారు విచారదినంగా జరుపుకున్నారు. నాటినుండి అనేక రూపాల్లో తమహక్కు కొరకై వారు ఆందోళన చేస్తూనే వున్నారు.

అహమ్మదాబాద్ ప్రజలు, ఈ ఆగస్టు 8న మృతవీరులను స్మరించుకుంటూ వారు నేలకొరిగిన చోట స్మారక చిహ్నాలను నిర్మించారు. గుజరాత్ ప్రజల వాంఛ ప్రశాంతంగా వారు జరిపిన ఆ ప్రదర్శనలో గాఢంగా వెల్లడైనది. ఆ వాంఛను పునరాలోచించే దానికి బదులు కాంగ్రెసు పాలకులు అర్ధరాత్రి వేళ ఆ చిహ్నాలను తొలగించారు. అక్కడున్న వలంటీర్లను నిర్బంధించారు. ప్రజల కోపోద్రేకాన్ని రెచ్చగొట్టారు. నిరాయుధులైన ప్రజలపై దారుణ హింసాకాండను కొనసాగిస్తున్నారు. మహాగుజరాత్ పరిషత్ అధ్యక్షుడు యీ అకృత్యాలకు అసమ్మతిగా నిరాహారదీక్ష ప్రారంభించారు.

కాంగ్రెసుప్రభుత్వం న్యాయమైన మహాగుజరాత్ కోర్కెను మొండిపట్టుతో తిరస్కరించడమే శాంతి ప్రియులైన గుజరాత్ ప్రజలలో అసంతృప్తి జ్వాలలు చెలరేగడానికి కారణం. శాంతియుతంగా జరుగుతున్న వారి అసమ్మతి ప్రదర్శనలను దుర్మార్గంగా అణచడానికి పోలీసు బలగాన్ని ప్రయోగించడమే కల్లోలానికి కారణం.

బొంబాయి ద్విభాషారాష్ట్ర నిర్మాణం పార్లమెంటుచే నిర్ణయించబడినదే అయినా అదొక తప్పు నిర్ణయమే. పార్లమెంటులో గల కమ్యూనిస్టు సభ్యుల ప్రతిఘటనను ఖాతరు చేయకుండా ఆనాడు ప్రభుత్వ సూచనను పార్లమెంటు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాన్ని అటు మహారాష్ట్రులు, ఇటు గుజరాతీలు అప్పటినుండి యిప్పటివరకు ఎడతెగకుండా వ్యతిరేకిస్తూనే వున్నారు. సంయుక్త మహారాష్ట్ర మహాగుజరాత్ రాష్ట్రాలు విడివిడిగా వుండాలనే న్యాయమైన కోర్కె నెరవేరేవరకూ విశ్రమించమని ఆ ప్రజలు తమ దీక్షను పదే పదే వెల్లడిస్తున్నారు. బొంబాయి పట్టణం మహారాష్ట్రకు చెందినదన్న విషయంలో కూడా సంయుక్త మహారాష్ట్ర సమితికీ, మహాగుజరాత్ పరిషత్తుకు మధ్య వివాదాలు లేకుండా పోయాయి.

ఈ న్యాయమైన కోర్కెల కొరకు జరిగే ఆందోళన హింసాకాండతో అణగారిపోయేది గాదని గత రెండేళ్ళ చరిత్ర చాటిచెబుతున్నది. బొంబాయి పట్టణంలో 1955 నవంబరులో 150 మంది వీరులు యీ కోర్కెకై తమ ప్రాణాలు కోల్పోయారు. అహమ్మదాబాద్‌లో రెండవసారి బలిదానం జరుగుతోంది. ఇప్పటికే ప్రజల రక్తం ఏరులై పారింది. ఇప్పుడైనా యీ హింసాకాండను నిలుపుచేయడం కాంగ్రెసు నాయకుల కర్తవ్యం.

గాంధీజీ పేరిట ఆయన సూత్రాలను స్మరిస్తే చాలదు; ఆయన పుట్టి పెరిగిన గడ్డకు, ఆయనకోరిన మహాగుజరాత్‌ను గుర్తించాలి. కేంద్ర ప్రభుత్వం వెంటనే బొంబాయి ద్విభాషా రాష్ట్రాన్ని విడగొట్టి సంయుక్త మహారాష్ట్ర, మహాగుజరాత్‌ల నిర్మాణానికి పార్లమెంటు ముందు బిల్లు ప్రవేశపెట్టాలి. గుజరాత్, మహారాష్ట్ర ప్రజల న్యాయమైన కోర్కెల్ని హింసాకాండతో అణచడంగాక ప్రజాస్వామికంగా పరిష్కరించాలి.

* * *

దేశంలో నిరుద్యోగసమస్యను గురించి పరిశీలనలు జరిపి, ఆ సమస్యను సమగ్రంగా పరిష్కరించడం కోసం లంక ప్రభుత్వం ఒక పథకాన్ని పూర్తిచేసింది.

'విశ్వవిద్యాలయాలు పాక్షిక రాజకీయాలకు కేంద్రాలు కారాదు'

విద్యాసంస్థల బిల్లులపై శాసనమండలిలో పలువురి విమర్శలు

['విశాలాంధ్ర' విలేఖరి]

హైద్రాబాద్, ఆగస్టు 14

ఆంధ్రప్రదేశ్‌లోని విద్యాసంస్థలను పాలకపక్షం పాక్షిక రాజకీయాలకు ఆటపట్టుగా తయారు చేయటానికి యూనివర్సిటీ సెనేట్‌లను ధనవంతులతో నింపటానికి ఆంధ్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని రాష్ట్ర శాసనమండలిలో శ్రీ సింగరాజు రామకృష్ణయ్య, తదితర ఉపాధ్యాయ ప్రతినిధులు నిశితంగా విమర్శించారు.

విద్యాసంస్థల (ఉస్మానియా, ఆంధ్ర, తిరుపతి యూనివర్సిటీల) బిల్లులను సిఫారసుల సంఘానికి నివేదించాలని సూచిస్తూ విద్యామంత్రి శ్రీ పట్టాభి రామారావుగారు ఈవేళ శాసనమండలిలో ప్రతిపాదించారు. విద్యామంత్రి ప్రతిపాదనను శాసనమండలి ఆమోదించింది.

తరువాత ఈ క్రింది సభ్యులతో సిఫారసుల సంఘం ఏర్పాటు చేయాలంటూ విద్యామంత్రి ప్రవేశపెట్టిన ప్రతిపాదనను కూడా సభవారు ఆమోదించారు:

శ్రీ అరిఫ్‌ఖాన్, శ్రీమతి ఫైజ్ ఉన్నీసాబేగం, శ్రీ పి. రమాకాంతిరావు, శ్రీ గెడియన్, శ్రీ విలియమ్స్, శ్రీ డి. నారాయణరెడ్డి, శ్రీ మఖ్దూం మొహియుద్దీన్, శ్రీ సింగరాజు రామకృష్ణయ్యగార్లు.

శాసనమండలిలో ఈవేళ చర్చను శ్రీ ఎస్. వి. శాస్త్రిగారు ప్రారంభించారు. ఆయన ఇలా ప్రసంగించారు:

ప్రజాభిప్రాయ సేకరణ కోసం మొదట్లో ప్రకటించిన ఉస్మానియా బిల్లులో కొన్ని అభివృద్ధికరమైన అంశాలను ఉపసంహరించారు మార్చి, అభివృద్ధినిరోధకమైన అంశాలను అందు జొప్పించారు. ఆ ఉపసంహరణ పుణ్యమా అంటూ, చివరకు ఆంధ్ర, తిరుపతి యూనివర్సిటీల బిల్లులుకూడా సవరించబడ్డాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని యూనివర్సిటీలు ఒకే పద్ధతిపై నడవాలని ప్రభుత్వం భావిస్తున్న పక్షంలో అసలు ఉన్న దండుగమారియైన ప్రోఛాన్సలర్ పదవులు లేకుండా చేయవచ్చుగదా? ఇంతకుముందు ఆంధ్ర, తిరుపతి యూనివర్సిటీలకు ప్రోఛాన్సలర్లు లేకపోయినా అవి సక్రమంగా నిర్వహించబడుతున్నాయి గదా?

విద్యాసంస్థలన్నీ కూడా యూనివర్సిటీల అదుపాజ్ఞలలో నిర్వహించబడాలని నేను కోరుతున్నాను. కాకినాడలోని పి. ఆర్. కాలేజీని ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న తర్వాత, ఆ కాలేజీ పరిపాలన మరింత అధ్వాన్నమై పోయిందని శ్రీ ఎస్. ఎ. శాస్త్రిగారు విమర్శించారు.

నామినేట్ చేయబడిన సభ్యులపై పాలకపక్ష ప్రభావం

కాంగ్రెసు సభ్యుడు శ్రీ పరశురామనారాయుడుగారు మాట్లాడుతూ, యూనివర్సిటీ సిండికేట్, సెనేట్‌లకు ప్రభుత్వం నామినేట్ చేసే సభ్యులపై పాలకపక్షం ప్రభావం తప్పనిసరిగా వుంటుందనీ, తత్ఫలితంగా విద్యాసంస్థల స్వేచ్ఛకు భంగం కలుగుతుందనీ చెప్పారు.

వైస్‌ఛాన్సలర్ ఎన్నికవల్ల వచ్చిన నష్టమేమిటి?

స్వతంత్ర సభ్యుడు శ్రీ సింగరాజు రామకృష్ణయ్యగారు ప్రసంగిస్తూ, ఇంతకుముందు ఆంధ్ర, తిరుపతి యూనివర్సిటీల వైస్‌ఛాన్సలర్‌లను ఎన్నుకొన్నందువల్ల దాపురించిన చెడు ధోరణి ఏమిటో విద్యామంత్రిగారు సెలవివ్వగలరా అని సూటిగా ప్రశ్నించారు.

మొత్తం విద్యా విధానమంతా ఒక రాజకీయ పక్షం గుప్పిట్లో బిగించబడుతూంటే, ఇక యూనివర్సిటీలు పాక్షిక రాజకీయాలకు కేంద్రాలుగా తయారవుతాయనటంలో సందేహానికి తావు లేదని ఆయన అన్నారు. యూనివర్సిటీలకు విరాళాలిచ్చిన దాతలతో సెనేట్‌లను నింపివేసే పద్ధతి చాలా ప్రమాదకరమైనదన్నారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సెనేట్‌లో ప్రాతినిధ్యం ఒసగాలని ఆయన సూచించారు.

శ్రీ పి. శ్రీరామమూర్తిగారు (స్వతంత్ర) మాట్లాడుతూ, యూనివర్సిటీల ఆర్థిక స్తోమతను ఇనుమడింపచేసేందుకు యూనివర్సిటీ ప్రచురణ శాఖను పరిపుష్టం కావించాలని సూచించారు. యూనివర్సిటీ విద్యార్థులనుంచి వసూలుచేసే రుసుములను తగ్గించాలన్నారు. విశ్వవిద్యాలయాలు అనుసరించవలసిన స్థూలమైన విధానాలను మాత్రమే ప్రభుత్వం నిర్ణయించాలనీ, అంతేకాని వాటి దైనందిన వ్యవహారాలలో ప్రభుత్వ జోక్యం పనికిరాదనీ ఆయన చెప్పారు.

రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గంనుంచి ఎన్నికైన శ్రీ పి. వి. సుబ్బశాస్త్రిగారు మాట్లాడుతూ, సెనేట్‌ల స్వభావాన్నే ప్రభుత్వం పూర్తిగా మార్చివేస్తున్నదని విమర్శించారు. ఒకవ్యక్తి విద్యార్హతలే సెనేట్ సభ్యత్వానికి గీటురాయిగా వుండాలని ఆయన సూచించారు.

పంచాయితీల ప్రతినిధులకు సెనేట్‌లో సభ్యత్వం యివ్వటంలో ప్రభుత్వం ప్రదర్శించిన దూరదృష్టిని, ఉపాధ్యాయుల విషయంలో ఎందుకు ప్రదర్శించలేదని ఆయన ప్రశ్నించారు.

ప్రతిపక్ష నాయకుని విమర్శ

శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు శ్రీ మఖ్దూం మొహియుద్దీన్ ప్రసంగిస్తూ, ఈ బిల్లులు అభివృద్ధి నిరోధకమైనవని విమర్శించారు.

ఆంధ్ర, తిరుపతి యూనివర్సిటీలలో వలెనే ఉస్మానియా యూనివర్సిటీలోకూడా వైస్ ఛాన్సలర్‌ను ఎన్నుకొనే పద్ధతిని ప్రవేశపెట్టగలమని లోగడ ఒక మంత్రిగారు విద్యార్థులకు హామీయిచ్చారు కాని, ఆ హామీని ఇప్పుడు మంత్రివర్గం ఉల్లంఘించింది. అంతేకాక, ఆంధ్ర, తిరుపతి యూనివర్సిటీలపైన కూడా నామినేషన్ పద్ధతిని ఇప్పుడు బలవంతంగా రుద్దుతున్నారని శ్రీ మఖ్దూం విమర్శించారు.

స్వపరిపాలనాధికారంగల యూనివర్సిటీలను ఆంధ్ర ప్రభుత్వం ఇప్పుడు విద్యామంత్రిత్వశాఖ ఉపాంగాలుగా మార్చటానికి ఉద్యమిస్తున్నదని ఆయన నిరసించారు. యూనివర్సిటీలకు విరాళాలిచ్చిన దాతలను సెనేట్‌కు నియమించటం సరికాదని శ్రీ మఖ్దూం చెప్పారు.

సోషలిస్టు సభ్యుడు శ్రీ గుప్తా రామారావుగారు మాట్లాడుతూ, వైస్ ఛాన్సలర్లను నామినేట్ చేసే పద్ధతి ప్రజాస్వామిక పద్ధతికి విరుద్ధమని చెప్పారు.

స్వతంత్ర సభ్యుడు శ్రీ అవసరాల రామారావుగారు మాట్లాడుతూ వైస్ ఛాన్సలరును నామినేట్ చేయటం అభివృద్ధినిరోధకమైన పద్ధతి అని నిశితంగా విమర్శించారు. ఇది ప్రజాస్వామిక విరుద్ధమని కూడా ఆయన అన్నారు.

మంత్రి జవాబు

విద్యామంత్రి శ్రీ పట్టాభి రామారావుగారు చర్చకు సమాధానమిస్తూ, నామినేషన్ పద్ధతి సరియైనదేనని సమర్థించారు. అన్ని విషయాలలోను ఎన్నికలు జరపాలనటం సరికాదు. చివరకు శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణవంటి సుప్రసిద్ధ విద్యావేత్త కూడా ఎన్నికలరాజకీయాల్లో పాల్గొనవలసివచ్చినప్పటికీ, కేవలం మూడు ఓట్లు మెజారిటీతో మాత్రమే ఆంధ్ర యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ పదవికి ఎన్నికైన సంగతి గమనార్హమని మంత్రిగారు చెప్పారు. కాశీ విశ్వవిద్యాలయం అనుభవం కూడా ఈ సందర్భంలో దృష్టిలో వుంచుకోవాలన్నారు.

విరాళాలిచ్చిన దాతలకు సెనేట్‌లో ప్రాతినిధ్యం ఒసగినంత మాత్రాన వచ్చేనష్టమేమీలేదని మంత్రిగారు చెప్పారు.

క్రితంరోజు విశేషాలు

నిన్నటి రోజున శాసనమండలిలో గవర్నరు ప్రసంగానికి అభినందనలు తెలిపే తీర్మానం ఆమోదించబడింది. గవర్నరు ప్రసంగంపై మూడురోజులపాటు సాగిన చర్చకు ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చిన పిమ్మట, సభవారు అభినందన తీర్మానాన్ని ఆమోదించారు.

ఉస్మానియా చార్టరు సవరణ బిల్లు

శాసనసభ ఆమోదం

హైద్రాబాద్, ఆగస్టు 14

ఉస్మానియా యూనివర్సిటీ చార్టరును సవరించే నిమిత్తం ఈవేళ శాసనసభలో ప్రవేశపెట్టబడిన బిల్లును ఆమోదించారు.

ఉస్మానియా యూనివర్సిటీ సెనేట్, కౌన్సిల్ కాలపరిమితిని మరో 9 నెలలపాటు పొడిగించటానికి ఈ బిల్లు ప్రభుత్వానికి అధికారం యిస్తుంది. (వి. వి.)

అధిక ప్రసంగం

శాసనమండలి అధ్యక్షుని మందలింపు

హైద్రాబాద్, ఆగస్టు 13

రాష్ట్ర శాసనమండలిలో గవర్నరు ప్రసంగంపై చర్చసందర్భంలో శ్రీ వి. రాఘవరెడ్డిగారు మాట్లాడుతూ, దొంగతనంచేసిన కార్మికులను తొలగిస్తే కమ్యూనిస్టులు లేనిపోని గొడవ, ఆందోళన చేస్తారని ఆరోపించగా, ప్రతిపక్ష నాయకుడు శ్రీ మఖ్దూం మొహియుద్దీన్ అందుకు ఆక్షేపణ తెలిపారు.

దానిపై శాసనమండలి అధ్యక్షులు పార్టీలపై ఆరోపణలు చేయరాదని శ్రీ రాఘవరెడ్డిగారిని మందలిస్తూ రూలింగ్ యిచ్చారు.

రాఘవరెడ్డి: నేను మాట్లాడినది సక్రమమే.

మఖ్దూం: రూలింగ్ యివ్వటానికి తమరెవ్వరండీ? (సభలో గొల్లున నవ్వు). (వి. వి.)

విజయవాడలో స్వాతంత్ర్య దినోత్సవాలు

విజయవాడ, ఆగస్టు 15

పదకొండవ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడ పట్టణంలోని ముఖ్య రహదారులన్నీ పచ్చ తోరణాలతో అలంకరించారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, రాష్ట్రప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వర్తకాగారాలు తమ భవనాలమీద జాతీయ పతాకం ప్రతిష్ఠించి ఉత్సవం చేసుకొన్నాయి. పట్టణంలో విద్యాసంస్థలు మిఠాయిలు పంచిపెట్టాయి. పురపాలక సంఘ ఆధీనంలోని విద్యాసంస్థలపై ఆయా ప్రాంత కౌన్సిలర్లు జాతీయ పతాకాలను ప్రతిష్ఠించారు. ఈ క్రింది సంస్థలలో స్వాతంత్ర్యదినోత్సవం జరిగింది.

సెంట్రల్ ప్రేమీమండలి, అగ్నికుల క్షత్రియసంఘం, పట్టణ హోమియోపతి వైద్యసంఘం, న్యాయవాద సంఘం, మెడికల్ అసోసియేషన్, పి. డబ్ల్యు. డి. క్లబ్, విద్యుచ్ఛక్తి శాఖ, సూపరింటెండింగ్ ఇంజనీరు కార్యాలయ ఉద్యోగులసంఘం, టెలిగ్రాఫ్ ట్రాఫిక్ ఉద్యోగులు, తంతితపాల 'బి' డివిజన్, ఆలిండియా రేడియో, గవర్నమెంటు ట్యుటోరియల్ కాలేజీ, మాంటిసోరి విద్యాలయం, శ్రీ రాజా రంగయ్యప్పారావు ప్రభుత్వ కళాశాల, ఆంధ్రలయోలా కళాశాల.

పట్టణ కమ్యూనిస్టు పార్టీ కేటి సాయంత్రం కొత్తపేట నుండి బ్రహ్మాండమైన ఊరేగింపు పట్టణ ముఖ్యవీధుల గుండా జరిపి అన్సారీ పార్కులో బహిరంగ సభను ఏర్పాటు చేసింది.

ఆంధ్రప్రదేశ్ జనసంఘం నేడు 'డిఫెన్సు డే'గా పరిగణించి రామమోహన గ్రంథాలయంలో సభ జరిపారు.

పట్టణ కాంగ్రెసువారు సామారంగం చౌక్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు.

విజయవాడలో రిక్షావారి సమ్మె

విజయవాడ, ఆగస్టు 15

నేడు ఉదయంనుంచి విజయవాడ పట్టణంలో రిక్షా కార్మికులు సమ్మె జరిపారు, ఆ కారణంగా రిక్షాలకు కరవు ఏర్పడింది. బహుకాలానికి జట్కాలకు గిరాకీ హెచ్చింది.

ఆగస్టు 27 నుండి ఆంధ్రలో విద్యుత్ పనివారి సమ్మె

సంఘాధ్యక్షులు శ్రీ కె. యల్. నరసింహం యం. పి. గారి ప్రకటన

విజయవాడ, ఆగస్టు 15

ఆంధ్రప్రదేశ్‌లోని విద్యుచ్ఛక్తి శాఖల్లో పనిచేసే ఉద్యోగులంతా ఆగస్టు 27వ తేదీ నుండి సమ్మె చేయడానికి నిశ్చయించుకొన్నారు.

ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ పనివారలసంఘ అధ్యక్షులైన శ్రీ కె. యల్. నరసింహం (యం. పి.) గారు ఈ క్రింది ప్రకటన చేస్తున్నారు.

ఆంధ్రరాష్ట్ర ఎలక్ట్రిసిటీ పనివారల సంఘం, జూలై 21వ తేదీన సమ్మెనోటీసు ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు చీఫ్ ఇంజనీరుగారికి ఇచ్చింది. తరువాత జరిగిన సంప్రదింపులలో ప్రధాన కోర్కెలైన హనుమంతరావు కమిటీ సిఫారసుల ప్రకారం జీతాల పెంపుదల, కరువు భత్యపు రేటులో పెంపుదల, ఉద్యోగాలను ఖాయం పరచటం మొదలైన విషయాలలో ఏ పరిష్కారం కుదరలేదు. అందువల్ల ఇతర ప్రభుత్వ పనివారల సంఘాలతో కలసి ఆగస్టు 27వ తేదీ ఉదయం 6 గంటలనుంచి, ఎలక్ట్రిసిటీ పనివారలు సమ్మె చేయుటకు నిశ్చయించుకున్నారు.

కార్మికుల కోర్కెలను అంగీకరించి, పరిష్కార మార్గం చూపేదానికి బదులు రాయలసీమలో ఇంతకుముందే ఇస్తున్న అదనపు రు. 6/- ఈ నెల ఇవ్వలేదు. ఆంధ్రపవర్ సిస్టంలోని జనరేషన్ సూపరింటెండెంటుగారు చట్టబద్ధంగా సమ్మెనోటీసు ఇచ్చినప్పటికీ ఈ సమ్మె చట్టవిరుద్ధమని తెలియజేస్తూ, ప్రతి కార్మికునికీ నోటీసు జారీచేసి సంతకం పెట్టమని నిర్బంధిస్తున్నారు. ఈవిధంగా సంతకం చేయమని నిర్బంధించటం పూర్తిగా చట్టవిరుద్ధం. ట్రేడ్‌యూనియన్ హక్కులను భంగపరచడమే కాబట్టి కార్మికులు ఆ నోటీసులపై సంతకాలు చేయటానికి నిరాకరించాలని యూనియన్ విజ్ఞప్తి చేస్తున్నది. మాచ్‌ఖండులో కూడా పారిశ్రామిక ట్రిబ్యూనల్ తీర్పుకు విరుద్ధంగా ఆగస్టు 24 నుండి కొంతమందిని రిట్రెంచిమెంటు చేయటానికి అధికారులు నిర్ణయించారు. దీనికి తోడు అనేకరూపాలలో బెదిరింపులుసాగిస్తూ కార్మికులను ఉద్రేకపరుస్తున్నారు.

ఇట్టి కార్మిక వ్యతిరేక, చట్టవ్యతిరేక చర్యలను విరమించి సమ్మెనోటీసులోని కార్మికుల న్యాయమైన కోర్కెలను అంగీకరించవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్‌లోని కార్మిక సంఘాలన్నీ ఎలక్ట్రిసిటీ కార్మికులకు అన్నివిధాల సహాయం ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

* * *

పారిస్, ఆగస్టు 8

ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి మారిస్ థోరే ఛారంట్ మారిటైమ్ ప్రాంతంలో బ్రహ్మాండమైన ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూ, దేశంలో తలెత్తుతూన్న ఫాసిస్టు నియంతృత్వాన్ని ప్రతిఘటించి సాంఘిక సంక్షేమాన్ని కాపాడవలసిందిగా ప్రజలను ఉద్బోధించారు.

మృతవీరుల చిహ్నాలపై బొంబాయి ప్రభుత్వ వైఖరి

కార్పొరేషన్ అనుమతించినా తాము అంగీకరించబోరట

అహమ్మదాబాద్, ఆగస్టు 14

అహమ్మదాబాద్ కార్పొరేషన్ అనుమతి ఇచ్చినప్పటికీ బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడా మృతవీరుల స్మారక చిహ్నాలను నిర్మించడానికి ప్రభుత్వం అంగీకరింపజాలదని బొంబాయి ముఖ్యమంత్రి శ్రీ వై. బి. చావన్ నేడిక్కడ పత్రికాగోష్ఠిలో స్పష్టం చేశారు.

ప్రయివేటు స్థలాల్లో స్మారక చిహ్నాలను నిర్మించుకొంటే తమకు ఎలాంటి అభ్యంతరం వుండదని ముఖ్యమంత్రి అన్నారు.

మృతవీరుల స్మారక చిహ్నాలను తొలగించిన విషయాన్ని గురించి ముఖ్యమంత్రి వివరిస్తూ మునిసిపల్ కార్పొరేషను ఆ చిహ్నాలను తొలగించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరివుండలేదని తెలిపారు. జరిగింది చట్టవిరుద్ధమైన పని గాబట్టి, వాటిని ప్రభుత్వమే తొలగించినదని ఆయన చెప్పారు.

మరల అక్కడ స్మారక చిహ్నాలను నెలకొల్పే ప్రయత్నాలను విరమించవలసిందిగా మహాగుజరాత్ జనతాపరిషత్ వారికి ఆయన హెచ్చరిక చేశారు.

తిరుగుబాటును అణచివేయడానికి ప్రభుత్వం కఠిన చర్యలను తీసుకోదలచిందని శ్రీ చావన్ చెప్పారు.

బొంబాయి మేయర్ విందు రద్దు

అహమ్మదాబాద్ ఘటనలకు విచారసూచకంగా

బొంబాయి, ఆగస్టు 14

ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో తాను ఏర్పాటు చేసిన విందును బొంబాయి మేయర్ శ్రీ ఎస్. ఎస్. మిరాజ్‌కర్ నేడు రద్దుచేస్తూ ఒక ప్రకటన చేశారు.

అహమ్మదాబాద్‌లోనూ గుజరాత్‌లోని పలుప్రదేశాల్లోనూ నేడున్న పరిస్థితికి బొంబాయి పౌరులు ఆందోళన చెందుతున్నారనీ, అందువలన ఈ విందును జరపడం సముచితం కాదనే అభిప్రాయానికి తాను వచ్చానని మేయర్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

విందుకు ఆహ్వానించబడిన ముఖ్యమంత్రికి, ఆయన సహచరులకు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, దౌత్యకార్యాలయాల ప్రతినిధులకు, తాను కలుగజేసిన ఇబ్బందికి ఆయన తన గాఢవిచారాన్ని తెలిపారు.

రైతుల నుంచి వసూలు చేసిన హెచ్చు కౌలు

తిరిగి ఇచ్చివేసేందుకు బిల్లు

హైద్రాబాద్, ఆగస్టు 14

ఎస్టేట్ల రద్దుచట్టం సవరణ బిల్లును రెవెన్యూమంత్రి శ్రీ కళా వెంకట్రావుగారు ఈ వేళ శాసనసభలో ప్రతిపాదించారు.

కౌలు తగ్గింపు చట్టంలో పేర్కొన్న కౌలు రేటుకుమించి రైతుల వద్దనుంచి భూస్వాములు వసూలు చేసిన హెచ్చుకౌలును తిరిగి రైతులకు ఇచ్చివేసేందుకు ఈ బిల్లువల్ల వీలు కలుగుతుంది.

ఈ బిల్లును ప్రతిపక్షాలన్నీ బలపర్చాయి.

తగ్గింపు చట్టంలో పేర్కొన్న కౌలుకుమించి రైతులవద్దనుంచి వసూలుచేసిన మొత్తం దాదాపు రు. 15 లక్షలు వుంటుందని రెవెన్యూ మంత్రి చెప్పారు.

ఈ బిల్లును శాసనసభవారు ఆమోదించారు.

విమాన ప్రమాదంలో 99 మంది దుర్మరణం

షానాన్ (ఐర్లాండు) ఆగస్టు 14

91 మంది ప్రయాణీకులతోనూ, ఎనిమిదిమంది నైమానిక సిబ్బందితోనూ న్యూయార్కుకు ప్రయాణం చేస్తూన్న డచ్చి సూపర్ కాన్‌స్టెలేషన్ విమానం ఉత్తర అట్లాంటిక్ సముద్రంలో కూలిపోయింది. అందులోని 99 మందీ చనిపోయారు.

యువజన ఉత్సవాలు

హైద్రాబాద్‌లో ప్రారంభం

హైద్రాబాద్, ఆగస్టు 14

యువజనోత్సవాలను ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారు నేడిక్కడ ప్రారంభించారు. ఈ ఉత్సవాలకు స్పీకరు శ్రీ కాళేశ్వర రావుగారు అధ్యక్షత వహించారు.

చుట్టుప్రక్కల రాష్ట్రాలనుంచి 200 మంది యువకులు, విద్యార్థులు ఈ ఉత్సవాలకు ప్రతినిధులుగా వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు వేలమంది యువకులు ఈ ఉత్సవాలలో పాల్గొంటున్నారు.

ఈ ఉత్సవాలను హైద్రాబాద్ భారత యువక సమాజంవారు ఏర్పాటు చేశారు.

రేయాన్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఒప్పందం

శ్రీ అజయఘోష్ వివరణ

తిరువనంతపురం, ఆగస్టు 13

నీలాంబూర్‌లో రేయాన్ పల్పు ఫ్యాక్టరీ నిర్మాణంకోసం బిర్లాలతో కేరళ ప్రభుత్వం చేసుకొన్న ఒడంబడికలోని కొన్ని అంశాలు "సరియైనవి కావనే" అభిప్రాయానికి కేరళ కమ్యూనిస్టు కమిటీ సెక్రటేరియట్ వచ్చిందని కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ అజయఘోష్ నేడిక్కడ పత్రికాగోష్ఠిలో తెలిపారు.

రాష్ట్రంలో నిరుద్యోగాన్ని తొలగించడానికి పరిశ్రమలను స్థాపించాలంటే బయటనుండి పెట్టుబడులను ఆహ్వానించవలసివుంటుంది. అప్పుడు తప్పనిసరిగా వారికి కొన్ని సౌకర్యాలను కలిగించవలసి వస్తుంది. అందుకే యిస్తావున్న ఈ సౌకర్యాలన్నీ సరియైనవో లేవో పరిశీలించవలసివుంది, అని శ్రీ అజయఘోష్ అన్నారు.

బిర్లాలతో చేసుకొన్న ఒడంబడికను తిరస్కరించే ఉద్దేశ్యం కేరళ ప్రభుత్వానికి ఏమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. ఉభయుల సమ్మతిపై ఒడంబడికలోని కొన్ని అంశాలను సవరించుకోవచ్చునన్నారు. ఏది ఏమైనా భవిష్యత్తులో జాగ్రత్తగా వ్యవహరించడానికి ఇదొక అనుభవంగా వుండగలదన్నారు.

ప్రదేశ్ వ్యవసాయ కూలీసంఘ కార్యవర్గ సమావేశం

విజయవాడలో ఆగస్టు 25, 26 తేదీలలో

హైద్రాబాద్, ఆగస్టు 14

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకూలీ సంఘ కార్యవర్గ సమావేశం ఈనెల 25, 26 తేదీలలో విజయవాడలోని కూలీసంఘ కార్యాలయంలో జరుగుతుంది.

ఈ సమావేశంలో భూసంస్కరణలు, బంజరు పంపకాల ఉత్తర్వు, కూలీ సంఘ నిర్మాణం మున్నగు సమస్యలపై చర్చలు జరుగుతాయి.

ఈ సమావేశానికి శాసనసభా ప్రతిపక్ష నాయకుడు శ్రీ సుందరయ్య, శాసనమండలి సభ్యుడు శ్రీ సంకు అప్పారావు, శ్రీ యలమందారెడ్డి, శ్రీ గంజి నాగేశ్వరరావు, శ్రీ బి. నర్సింహారెడ్డి మున్నగువారు హాజరవుతున్నారు.

కార్యవర్గ సభ్యులందరికీ ప్రయాణ ఖర్చులు ఇవ్వగలమని సంఘాధ్యక్షులు శ్రీ గుంటూరు బాపనయ్యగారు తెల్పుతున్నారు. (వి. వి.)

* * *

డాక్టర్ సి. వి. రామన్ మూడు మాసాలపాటు తూర్పు యూరప్ దేశాల్లో పర్యటించి తిరిగి స్వదేశానికి ఆగస్టు 13వ తేదీన చేరుకొన్నారు.

పరిపాలనా వ్యవహారాల్లో పాలకవర్గం పక్షపాత బుద్ధి

గవర్నరు ప్రసంగంపై చర్చలో పలువురు శాసనసభ్యుల విమర్శ

('విశాలాంధ్ర' విలేఖరి)

హైదరాబాద్, ఆగస్టు 13

గ్రామ పంచాయతీ సమితులలో ప్రతిపక్షాలకు ప్రాతినిధ్యం కలగకపోవటమూ, వాటిల్లో కేవలం కాంగ్రెసువారికే నింపటమూ చాలా దారుణమని సోషలిస్టుసభ్యుడు శ్రీ రత్న సభాపతి ఈవేళ శాసనసభలో గవర్నరు ప్రసంగంపై చర్చలో పాల్గొంటూ విమర్శించారు.

ఈ సమితి సభ్యులను నామినేట్ చేసే అధికారం ప్రభుత్వానికి వున్నప్పటికీ, వారు కేవలం కాంగ్రెసువారికే నామినేట్ చేయటాన్ని బట్టిచూస్తే, వారు కాంగ్రెసు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారా అని అనుమానించవలసి వస్తున్నదన్నారు.

రాష్ట్రంలో పలుచోట్ల శాంతిభద్రతలు లేకుండా పోయాయని కొందరు సభ్యులు చెప్పుతున్నారు. ఈ విషయంపై నిష్పాక్షిక విచారణ జరపడం అవసరం. అలాగే ప్రభుత్వ వ్యవహారాలలో అధికార పక్షం జోక్యాన్ని గురించి కూడా విచారణ జరిపించాలని శ్రీ రత్నసభాపతి కోరారు.

సి. డి. యల్. యఫ్. సభ్యులు శ్రీ అమృతలాల్ శుక్లా ప్రసంగిస్తూ, గ్రామ పంచాయతీ సమితులను ప్రజాస్వామిక పద్ధతులలో ఏర్పాటు చేయటంలేదని విమర్శించారు.

కాంగ్రెసు సభ్యుడు శ్రీ వెంకయ్య రాయ నాయుడు మాట్లాడుతూ, తాను మాట్లాడేందుకు అవకాశం యివ్వాలని నిన్న మొన్న స్పీకరును కోరినప్పటికీ, తన కోర్కెను స్పీకరు నిరాకరించారనీ, అందుకు నిరసనగా తాను ఈ రోజున అసలు మాట్లాడబోవడంలేదనీ చెప్పి, కూర్చున్నారు.

ఆంధ్రకు జరుగుతున్న అన్యాయం

శ్రీ టి. బాలయ్య (కాంగ్రెసు): సింద్రీ ఎరువులఫ్యాక్టరీలో టన్ను 1కి రు 380 లకు ఎరువు ఉత్పత్తి అవుతుంటే, ఆంధ్రదేశం నుంచి టన్ను 1కి రు 490 లను కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్నది. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రైతాంగం నుంచి అన్యాయంగా నాలుగు కోట్ల రూపాయలను [illegible]న్నది.

శ్రీ బి వి కొండయ్య (కాంగ్రెసు): రాయలసీమ జిల్లాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. పైగా ఇవి ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వానికి తెలుసు. నిర్లక్ష్యం చేస్తున్నారు.

[illegible] సభ్యుడు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి మాట్లాడుతూ, గవర్నరు ప్రసంగం చిత్రగుప్తుని లేఖవలె వున్నదన్నారు. హనుమంతరావు కమిటీ సిఫారసులను ప్రభుత్వం పునఃపరిశీలించాలని ఆయన కోరారు.

మాజీమంత్రి శ్రీ గౌతు లచ్చన్న ప్రసంగిస్తూ, వెనుకబడిన కులాలకు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రభుత్వం న్యాయం చేయటంలేదని విమర్శించారు. మంత్రుల [illegible] ఎంత [illegible] శ్రీకాకుళం సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకు వ్యవహారాలు [illegible]న్నారు.

శ్రీమతి [illegible] (సి. డి. యల్. యఫ్.): గ్రామ పంచాయతీ సమితుల నిర్మాణంలో ప్రభుత్వం పక్షపాతబుద్ధితో ప్రవర్తిస్తున్నది. ప్రతిపక్షాలకు వాటిల్లో స్థానంలేకుండా చేయటానికి ప్రభుత్వం అక్రమ [illegible]లను అవలంబిస్తున్నది.

[illegible] చర్చ వివరాలు

నిన్న [illegible] శ్రీ [illegible] గారు చెప్పారు:

మూడొంతుల [illegible] సమితుల్లో [illegible] అన్ని [illegible] లోను కాంగ్రెసుపార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలలో 30 మంది కమ్యూనిస్టు అభ్యర్థుల నామినేషన్ పత్రాలను అక్రమంగా త్రోసివేసి, కాంగ్రెసు పార్టీ విజయానికి తోడ్పడ్డారు.

[illegible] ఉద్యమంలో పనిచేసిన వారికి ప్రభుత్వం కమిషన్ ఇస్తున్నది. నా నియోజకవర్గంలో చిన్న [illegible] వారు ఉద్యమానికి [illegible] వసూలుచేస్తే, అసలు [illegible] నుంచి [illegible] వ్యాపారస్తులకు [illegible] కమిషన్ చెల్లించారు. ఇది ఎలా జరిగింది?

ప్రభుత్వం ఇప్పుడు ఇస్తున్న సబ్సిడీలను కాంగ్రెసు కార్యకర్తలు తమలో తాము పంచుకొని మింగేస్తున్నారు. రైతులకు అన్యాయం జరుగుతోంది.

స్పీకరు: ఇలా ఉదాహరణలు చెప్పటం సాగిస్తే, ఆరు గంటలైనా చెప్పవచ్చు.

శ్రీ బద్దంఎల్లారెడ్డి: ఉదాహరణలు ఇవ్వకుండా ఆరోపణలు చేస్తున్నారని ఇందాక సంజీవరెడ్డిగారు చెప్పిన సంగతిని స్వీకరించడానికే తెస్తున్నాను.

తరువాత శ్రీ సి. వెంకటరెడ్డి పి. డి. యల్. యఫ్. ప్రసంగించారు.

గవర్నరు ప్రసంగానికి అభినందనలు తెలియజేసే తీర్మానం ఈవేళ ఆంధ్ర శాసనసభలో ఆమోదింపబడింది. ఈ తీర్మానానికి ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన సవరణలన్నీ వీగిపోయాయి.

రేడియో

ఆదివారం ఆగస్టు 17

విజయవాడ

ఉదయము: 6-35 ప్రసార తరంగిణి; 7-0 (తె. వా); 7-15 ఎమ్. బాలమురళీకృష్ణ; 7-45 సంగీత శిక్షణ

మధ్యాహ్నము: 2-20 బాలవినోదం (హైదరాబాద్‌నుండి రిలే);

సాయంత్రము: 6-15 గ్రామస్థులకు, అన్నమయ్య జీవితచరిత్ర; 7-0 (తె వా); 7-15 గ్రామస్థులకు, అన్నమయ్య జీవితచరిత్ర; 7-40 సుగమ్ సంగీత్; 8-0 కర్రా ఉమామహేశ్వరరావు; 8-30 కలిది సుబ్బారావు: వేణువు; 9-30 రసమయి; 10-0 కర్రా ఉమామహేశ్వరరావు: 10-30 సమాప్తి.

హైద్రాబాద్

ఉదయము: 7-15 భక్తిమకరందం 8-45 భజన్, గీత్; 9-45 కేటివినోద కార్యక్రమము, కిరాయి నాటకం - పాట: టాంక్ బండ్‌మీద ఒక సాయంత్రం; 10-15 ప్రణాళికప్రగతి నివేదిక; 10-20 పి. వి. విఠల్, వి. వసంత: గీతావళి; 10-30 టి. ఎన్. చంద్రశేఖరన్: వేణువు; 11-30 జె. ఎమ్. డోమింగో: వయొలిన్;

మధ్యాహ్నము: 2-20 బాలవినోదం;

సాయంత్రము: 6-15 గ్రామసీమ, ప్రకటనలు, ధరలు, వాతావరణము; 7-15 గ్రామసీమ; 8-50 ఆకాశవాణి వాద్యబృందము - నిర్వహణ: రవిశంకర్; 9-30 రసమయి; 10-30 సమాప్తి.

మద్రాసు (బి)

మధ్యాహ్నము: 2-30 బాలవినోదం, (హైద్రాబాద్‌నుండి రిలే), (మద్రాసునుండి రిలే);

సాయంత్రం: 6-15 గ్రామస్థులకు; 7-0 (తె. వా); 7-15 గ్రామస్థులకు; 7-30 సంధ్యాగానం; 7-45 వి. జయలక్ష్మి; 9-30 రసమయి; 10-30 సమాప్తి.

కాంగ్రెసు తీర్మానాలనే కాలరాస్తున్న ఆంధ్రప్రభుత్వం

శాసనమండలిలో వ్యవసాయకూలీ నాయకులు శ్రీ బాపనయ్యగారి ప్రసంగం

['విశాలాంధ్ర' విలేఖరి]

హైదరాబాద్, ఆగస్టు 13

అవడి, ప్రాగ్జ్యోతిషపురాలలో జరిగిన కాంగ్రెసు మహాసభలు చేసిన తీర్మానాలకు విరుద్ధమైన విధానాలను ఆంధ్ర ప్రభుత్వం అవలంబిస్తున్నదని శాసనమండలిలో కమ్యూనిస్టు-డెమోక్రాట్స్ గ్రూపు సభ్యుడు శ్రీ గుంటూరు బాపనయ్యగారు గవర్నరు ప్రసంగంపై విమర్శించారు.

ఆంధ్ర మంత్రివర్గం తయారుచేసిన భూసంస్కరణలవల్ల పేదలకు పంచేందుకు ఎకరం భూమికూడా మిగలబోదనీ, లక్ష ఎకరాలభూమి లభిస్తుందని చెప్పటం కేవలం మోసమనీ శ్రీ బాపనయ్య వివరించారు.

బ్రిటిషువారి హయాంనాటినుంచి వ్యవసాయకూలీలు సాగుచేసుకొంటున్న లంకభూములను ఈనాడు కాంగ్రెసు ప్రభుత్వం బలవంతాన వశంచేసుకొంటున్నదని ఆయన చెప్పారు.

శాసనమండలి ఉపాధ్యక్షులు ఈవేళ సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రతిసభ్యుడు కూడా [illegible] నిమిషాలకన్న హెచ్చు మాట్లాడకూడదని నిబంధన విధించారు. దాంతో సభ్యులందరి ప్రసంగాలు కేవలంగా మారిపోయాయి.

రాయలసీమలో కరువు పరిస్థితి

శ్రీ వై. ఈశ్వరరెడ్డి (సి. డి. యల్. యఫ్.): గవర్నరు ప్రసంగం ప్రజల కష్టాలు బాధలు తెలుసుకొనేటట్లు రాకుండా ఇతరులకు కప్పిపుచ్చుతోంది. రాయలసీమ ప్రాంతంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడ తక్కావీ అప్పుల వసూళ్ళను వాయిదా వేయాలి. తుంగభద్ర హైలెవెల్ కాలువ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి [illegible]నీయం. దానికి వ్యతిరేకంగా ఆంధ్రప్రభుత్వం నిలబడితే, ప్రజలు రాష్ట్రప్రభుత్వం అండ నిలుస్తారు.

తరువాత స్వతంత్ర సభ్యుడు శ్రీ పి. సుబ్రహ్మణ్యం ప్రసంగించారు.

శ్రీమతి భారతీదేవిరంగా మాట్లాడుతూ, [illegible] పరిమితులు విధించటంతోపాటు, ఇతర ఆదాయాలపైనకూడా పరిమితి విధించాలని సూచించారు.

శ్రీ ఆకుల [illegible] నరసింహారెడ్డి (పి. డి. యల్. యఫ్): భూస్వాములు దీపంవుండగానే [illegible] పెట్టుకొన్నారు. ఆంధ్ర ప్రభుత్వం వారికి ఆ అవకాశాన్ని కావాలని కల్పించింది. పైగా కమతాలపరిమితిని [illegible]ంచింది.

జన సంఘం సభ్యుడు శ్రీ అవసరాల రామారావు భూసంస్కరణలవల్ల వ్యవసాయ రంగం [illegible] దెబ్బతింటుందని చెప్పారు. శ్రీమతి కదవ రామసుబ్బమ్మ కమతాల పరిమితిని ఇంకా పెంచాలన్నారు. శ్రీమతి సీతామహాలక్ష్మమ్మ ఎన్. జి. వో. ల సమస్యను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించాలన్నారు.

చిత్రనిర్మాత శ్రీ బి ఎన్. రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రదేశమంతటా గాలించినా ఒక్క నాటకశాలకూడా కానరాదని, ఇది చాల విచారకరమైన సంగతని చెప్పారు.

మంత్రుల ప్రయాణ ఖర్చులపై ప్రశ్నలు

హైదరాబాద్, ఆగస్టు 13

మంత్రుల ప్రయాణ ఖర్చులపై ఆంధ్ర శాసనసభలో ప్రశ్నోత్తరాలు జరిగాయి. (కొన్ని వివరాలను నిన్న నే యిచ్చాం. మరికొన్ని నేడు ప్రచురిస్తున్నాం—సం.)

శ్రీ వెల్లంకి విశ్వేశ్వర రావు: సినిమాల శతదినోత్సవాలకు ప్రారంభకులుగా వెళ్లినప్పుడు ప్రయాణ ఖర్చులు తీసుకుంటారా?

శ్రీ సంజీవరెడ్డి: శతదినోత్సవాలు ఎప్పుడో జరుగుతాయి. ఇది ప్రజాస్వామ్యం. మేము ప్రజలతో సంబంధం పెట్టుకోవాలి కదా.

ప్రశ్న: కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు వెళ్లినప్పుడు ప్రయాణపు ఖర్చులు తీసుకుంటారా?

సమాధానం: మేము అధికారరీత్యా పర్యటిస్తాము. ఆ విధంగా పర్యటించేప్పుడు ఆయా ప్రాంతాల్లో కాంగ్రెస్ వారులను కలుసుకుంటాము. భూమిని వదలిపెట్టి గాలిలో నిలవలేము కదా.

ప్రశ్న: మంత్రులు వెళ్లిన ప్రాంతాలలో ఒకటి రెండు రోజులుంటే అక్కడి ప్రజల సమస్యలు తెలుస్తాయి కదా?

సమాధానం: ఏ ప్రభుత్వం యిష్టప్రకారం ఆ ప్రభుత్వం పర్యటన కార్యక్రమాలను వేసుకుంటుంది.

లంకభూముల కొరకు సకాలంలో దరఖాస్తురాలేదట

రెవెన్యూమంత్రి సమాధానం

('విశాలాంధ్ర' విలేఖరి)

హైదరాబాద్, ఆగస్టు 13

[illegible] కో-ఆపరేటివ్ సొసైటీలనుండి సకాలంలో దరఖాస్తులు [illegible] లంకభూములలో [illegible] పంపకం [illegible] రెవెన్యూమంత్రి శ్రీ కళా వెంకట్రావుగారు ఈవేళ శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో తెలియజేశారు.

ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మొత్తం 35411 ఎకరాల లంకభూమి వున్నదని 1956-57 లో 19997 ఎకరాలను మాత్రమే ఫీల్డు సొసైటీలకు, ఇతర అనేక సొసైటీలకు కౌలుకు యిచ్చామని మంత్రి తెలిపారు. 14996 ఎకరాలు మాత్రమే వేలం వేయబడినట్లు తెలిపారు. 1957-58 లో వేలంవేసిన భూమికలన ప్రభుత్వానికి రు 54428/- శిస్తు వచ్చిందని అన్నారు.

ఉపప్రశ్నలకు సమాధానం యిస్తూ భూమికోరుతూ సొసైటీల నుండి తగుసంఖ్యలో దరఖాస్తులు రావడంలేదని, అందుచేత ఆయా ప్రాంతాల నాయకులు నిజమైన సంస్థలనుండి సకాలంలో దరఖాస్తులు వచ్చేటట్లు చూడాలన్నారు.

తెలంగాణా ప్రాంతంలో చెరువులోపట్టు భూములను ఏకసాలకౌళ్ళకు యివ్వకూడదా అన్న ప్రశ్నకు సమాధానం యిస్తూ [illegible] పద్ధతిలో వాటిని సాగుకిచ్చే ప్రతిపాదన ప్రభుత్వ ఆలోచనలో వుందన్నారు. 1951కి పూర్వం యిటువంటిపద్ధతి అమలులో వుందన్నారు.

పూడిపోయిన చెరువులను సాగు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పెనాల్టీలు విధిస్తున్నదని పలువురు సభ్యులు ఫిర్యాదు చేయగా మంత్రి సమాధానం చెబుతూ అనధికారంగా ఆక్రమించుకున్నట్లయితే పెనాల్టీ తప్పదన్నారు. ఇటీవల బంజర్లు పంపకాన్ని గురించి ప్రభుత్వం ప్రకటించిన నిబంధనలను పాటించవలసిందిగా మంత్రి చెప్పారు.

ఎస్. పి. పోలీ సంఘం

ట్రేడ్ యూనియన్ చట్టం క్రింద ఎస్. పి. పోలీ సంఘాన్ని ప్రభుత్వం గుర్తించవలసిందని ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి శ్రీ [illegible]రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఎస్. పి. పోలీసు తమ యూనియన్లను తెలియజేసే అవకాశం [illegible] లాభకరంకాదా? అన్న ప్రశ్నకు ముఖ్యమంత్రి "యూనియన్లు [illegible]" అని జవాబిచ్చారు.

మునగాల పరగణా

మునగాల పరగణా చాలా చిన్న ప్రాంతం గనుక అక్కడ ప్రత్యేక సెంటర్ నెలకొల్పడం సాధ్యం కాదని శ్రీ దొడ్డా నరసయ్య అడిగిన ప్రశ్నకు ప్రణాళికామంత్రి సమాధానం యిచ్చారు.

వేతనాలసంఘం నివేదిక

సెప్టెంబరులో ఆంధ్ర ప్రభుత్వ వేతనాల కమిటీ తన నివేదిక సమర్పిస్తుందనీ, అందుపై ప్రభుత్వం వెంటనే తగు నిర్ణయాన్ని తీసుకుంటుందనీ ఆర్థికమంత్రి శ్రీ బి. శ్రీరామమూర్తి (సోషలిస్టు) గారి ప్రశ్నకు సమాధానం యిచ్చారు.

రాహుల్జీకి అస్వస్థత

పెకింగ్, ఆగస్టు 10

ప్రపంచ ప్రసిద్ధ భారతీయ శాస్త్రవేత్త త్రిపిటకాచార్య శ్రీ రాహుల్ సాంకృత్యాయన్ జబ్బుపడి ప్రస్తుతం పెకింగ్‌లో యూనియన్ మెడికల్ కాలేజీ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు.

మేదినిపురంలో భూస్వామి గూండాల దాడి: *14 మందికి గాయాలు*

సిద్దిపేట, ఆగస్టు 11

సిద్దిపేట తాలూకా మేదినిపురం గ్రామంలో గొల్ల రాజయ్య అనే రైతును 30 సంవత్సరాలుగా సాగుచేసే భూమి నుండి బేదఖలు చేయించడానికై మంగోలు పట్వారీ నర్సారెడ్డి ఒక పెద్ద గూండాదళాన్ని పంపించాడు. ఆ దాడిలో 14 మందికి గాయాలు తగిలాయి. 4 గురు ప్రమాదావస్థలో వున్నారు.

మంగోలు పట్వారీ నర్సారెడ్డి బలవంతంగా ఈభూమిని స్వాధీనంచేసుకోవాలని చేసేప్రయత్నాన్ని మొత్తం గ్రామప్రజలు అన్యాయమని ఖండించారు. భయపడుతున్న పేదరైతుకు సహాయంగా గ్రామప్రజలు నాగళ్లు కట్టుకొని భూమిని దున్నుతున్నారు. నర్సారెడ్డి వేముల్‌ఘాట్ గ్రామం నుండి కొంతమంది గూండాలను ప్రోగించి వారిపై దాడిచేయించాడు. తత్ఫలితంగా 14 మంది గాయపడ్డారు. ఇందులో 14 సంవత్సరాల పిల్లవాడికి నెత్తిపై బలమైన గాయం తగిలింది. 60 సంవత్సరాల వృద్ధులకు కూడా గాయాలు తగిలాయి.

ఈ వార్త సిద్దిపేట కమ్యూనిస్టు పార్టీ ఆఫీసుకు తెలియగానే, పార్టీ కార్యదర్శి యం. కె. మొయినొద్దీన్, ఆఫీసు కార్యదర్శి యస్. బాల్‌రెడ్డి గారిలు వెంటనే డి. వై. యస్. పి. కి సర్కిల్ యిన్‌స్పెక్టరుకు యీ విషయం తెలియజేశారు.

పోలీసులు అక్కడికిపోగానే గూండాలు పారిపోయారు. పోలీసు పంచనామా చేసుకొని గాయపడినవారిని [illegible] ఆసుపత్రిలో చేర్పించారు. ప్రజలంతా నర్సారెడ్డి పెట్టే బాధలు, అన్యాయాలు భరించలేమని పోలీసులకు మనవిచేసుకున్నారు. [illegible] నర్సారెడ్డి [illegible] కారణం అడుగగా మంచిభూములను అక్రమంగా గుంజుకుంటాడు. కంచెలు మేపమంటాడు. వెట్టి చేయించుకుంటాడు. కష్టానికి తగిన ఫలితం యివ్వడు అని ఫిర్యాదుచేశారు. [illegible] ఈ బాధలు మేము భరించలేమని ప్రజలు పోలీసులతో మనవి చేసుకున్నారు. ఒక వారంరోజులు గ్రామంలో పోలీసుకాపలా పెట్టేందుకు అధికారులు హామీ యిచ్చారు.

సభలు - సమావేశాలు

తెనాలి తాలూకా ఇంటూరులో ఆగస్టు 20 వ తేదీ సాయంత్రం 5 గంటలకు పంచాయతీ బోర్డు గ్రంథాలయానికి ప్రారంభోత్సవం జరుగుతుంది. రాత్రి 8 గంటలకు పాలకొల్లు బాలబాలికల బుర్రకథ వుంటుంది.

* * *

ఆంధ్రప్రదేశ్ [illegible] ఇంజనీర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈనెల 16 వ తేదీ 5-30 గంటలకు విజయవాడలో యస్. కె. పి. వి. వి. హిందూ హైస్కూలులో జరుగుతుంది.

* * *

తాడిపత్రి తాలూకా వ్యవసాయ కూలీల ద్వితీయ మహాసభ ఆగస్టు 31 వ తేదీ [illegible] గ్రామంలో జరుగుతుంది.

* * *

అనంతపురం జిల్లా తృతీయ రైతు మహాసభ కల్యాణదుర్గంలో ఈ నెల 24,25 తేదీలలో జరుగుతుంది.

* * *

గుంటూరుజిల్లా మోటారు కార్మిక సంఘ కార్యకర్తల సమావేశం ఈనెల 17 వ తేదీ ఉదయం 10 గంటలనుండి జిల్లా ఫెడరేషన్ ఆఫీసు, సిటీ ప్రెస్ మేడపై జరుగుతుంది.

• • •

పశ్చిమ గోదావరిజిల్లా [illegible] కార్యకర్తల సమావేశం ఈనెల 16న తాడేపల్లిగూడెంలో జరుగుతుంది.

• • •

తూర్పుగోదావరిజిల్లా కమ్యూనిస్టు కమిటీ అత్యవసర సమావేశం రాజమండ్రిలో, ఈనెల 28, 29 తేదీలలో జరుగుతుంది.

రాయదుర్గంలో చేనేతవారి వలస

రాయదుర్గం, ఆగస్టు 12

రాయదుర్గంలోని 12 వేల చేనేత కార్మికులు [illegible] నిరుద్యోగానికి గురైనారు. [illegible] సంఘంలో 300 మగ్గాలలో 8 మాత్రం పనిచేయుచున్నవి. నూలు ధరలు సరిగా లేవు. 20 కౌంటు రు.16కు 80, 40 కౌంట్లు 50 నుండి 60 రూపాయలు పెరిగినవి. రంగులధరలు కూడా పెరిగినవి. [illegible] వలస పోతున్నారు.

సత్వరంగా ప్రభుత్వం [illegible] కేంద్రాలు స్థాపించి వీరికి వృత్తి కల్పించవలసిన కర్తవ్యం [illegible]. లేని యెడల ఆకలి చావులు తప్పవు.

నల్లగొండ జిల్లాలో కల్లుగీత పాటలు వాయిదా వేయాలి

శాసన సభ్యుల విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 12

నల్లగొండజిల్లాలో ప్రస్తుతం కరవు ఉధృతంగా వున్నందున, కల్లుగీత వేలం పాటలను వాయిదా వేయాలని కోరుతూ, నల్లగొండ జిల్లా శాసన సభ్యులంతా కలిసి రెవెన్యూమంత్రి శ్రీ కళా వెంకటరావు గారికి నివేదించారు. శాసన సభ్యుల సూచన మేరకు కల్లుగీత వేలంపాటను వాయిదావేస్తూ ఆదేశాలు పంపిస్తానని మంత్రిగారు వాగ్దానం చేసినట్లు తెలుస్తోంది.

సాక్షులను సైతం చేడిలు వేస్తున్న పోలీసుల జులుం

రాజమండ్రి, ఆగస్టు 11

కోర్టులో ఒక కేసులో సాక్షిగా హాజరు పరచడానికై ధవళేశ్వరం గ్రామ మునసబులను పోలీసులు చేడీలు వేసి తీసుకొని వెళ్ళినందుకు తూర్పుగోదావరిజిల్లా గ్రామోద్యోగుల సంఘ కార్యవర్గం తన తీవ్ర నిరసనను తెలియజేసింది.

ఈ విషయంపై దర్యాప్తుజరిపి తగు చర్యలు తీసుకోవటానికి 5 గురితో కూడిన ఒక కమిటీని వేసింది.

కార్యవర్గ సమావేశం ఈ నెల 6వ ఉపాధ్యక్షుడు శ్రీ వి. యం. సూర్యారావు అధ్యక్షతన జరిగింది.

రామచంద్రపురం మేజిస్ట్రేటు ధవళేశ్వరం గ్రామ మునసబు శ్రీ సన్న నరసింహానికి సాక్షి సమనులు జారీ చేశారు. అవి తహశీల్దారుద్వారా రాలేదని వాటిని మునసబు తీసుకొనడానికి నిరాకరించారు. మేజిస్ట్రేటు గారు అందుపై వారంటు జారీ చేయగా, ఆ వారంటుతో పోలీసులు వచ్చి మునసబుగారి చేతులకు చేడీలు వేసి తీసుక వెళ్ళారు.

అధికపన్నులను నిరసిస్తూ ఊరేగింపు

గుంతకల్లు, ఆగస్టు 10

మున్సిపల్ కౌన్సిల్ విధించిన అధిక పన్నులను నిరసిస్తూ "అధిక పన్నుల వ్యతిరేకాందోళన కార్యాచరణసమితి" పేరు గొప్ప ఊరేగింపు జరిపింది. "అక్రమాలతో కూడుకొన్న రివిజన్‌ను రద్దుచేయ్యాలి" "కౌన్సిల్ పెంచిన అదనపు పన్నును రద్దుచెయ్యాలి." అనే నినాదాలతో ప్రజలు ఊరేగింపుచేశారు. శ్రీ యం. గోవిందులు, శ్రీ బి. టి. పక్కీరప్ప, శ్రీ సిద్దేశ్వర శర్మ, శ్రీ వి బసప్ప, శ్రీ సి. యం. స్వామిగారు ఊరేగింపుకు నాయకత్వం వహించారు.

ఊరేగింపు చైర్మన్‌గారి యింటి వద్దకు వెళ్లింది. అదనపుపన్నులను రద్దుచేస్తూ న్యాయమైన రివిజన్ జరపాలని వున్న ఒక మెమోరాండం చైర్మన్‌గారికి సమర్పించారు. అంతా ప్రభుత్వం చేతుల్లోనే వుందని, తానేమీ చేయలేనని సూక్ష్మంగా చెప్పి చైర్మన్ గారు తప్పించుకోజూచాడు. చేతగానప్పుడు వెంటనే రాజీనామా ఇవ్వమని ప్రదర్శకులంతా ఒక్క గొంతుతో నినదించారు. దానిమీద ఒక వారం రోజులలోపల కౌన్సిల్‌ను సమావేశపరచి పన్నుపెంచినప్పటి కౌన్సిల్ [illegible] అప్పీలు చేసుకోడానికి ప్రజలకు అవకాశం కలిగేటట్లు తీర్మానం గావించి ప్రభుత్వానికి పంపిస్తానని చైర్మన్ హామీ యిచ్చారు. తర్వాత మున్సిపల్ ఆఫీసు ఆవరణంలో శ్రీ గౌస్‌మొహిద్దీన్ సాహెబుగారి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. వారం రోజులలో కౌన్సిల్ సమావేశమై ప్రస్తుతం పెంచిన పన్నులను రద్దు చేసి న్యాయమైన రివిజను అమలు జరపాలని సభలో తీర్మానించారు.

కేరళ ప్రభుత్వంపై ప్రజల ఆదరణ అపారం

శ్రీ దేవులపల్లి వెంకటేశ్వరరావు హెచ్చరిక

[illegible]కొండ, ఆగస్టు 12

"బేదఖళ్ళ నిలుపుదల, [illegible], చిన్న ఉద్యోగుల జీతాల పెంపుదల, ఉపాధ్యాయుల వృత్తిభద్రత, సత్వరమే భూసంస్కరణల బిల్లు రూపొందించటం, మొదలగు పనులను కొద్ది సంవత్సరకాలంలో చేసి ప్రజల మన్ననలందిన కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఎలాగైనా అల్లకల్లోలం చేసి, ఆ రాష్ట్రంలో ప్రతిష్ఠంభన తేవాలని అక్కడి కాంగ్రెస్ నాయకత్వం ప్రయత్నిస్తున్నది. కాని కేరళ ప్రభుత్వానికి కేరళలోని పేద ప్రజల ప్రజాస్వామికవాదుల అండదండలున్నాయని వారు మరచిపోయినట్లుంది" అని ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిస్టు నాయకులు పార్లమెంటు సభ్యులు అయిన శ్రీ దేవులపల్లి వెంకటేశ్వరరావు ఇక్కడ జరిగిన బహిరంగసభలో హెచ్చరించారు.

సభకు శ్రీ కోట రామయ్య అధ్యక్షత వహించారు. నల్లగొండ జిల్లా కమ్యూనిస్టు కమిటీ నడిపిన రాజకీయ పాఠశాల నిర్వహణ సందర్భంలో ఈ సభ జరిగింది.

తరువాత శ్రీ దొడ్డా నరసయ్య గారు కమ్యూనిస్టుపార్టీ నాయకులను తయారుచేయుటకు ఏర్పాటుచేసిన స్కూలులో పార్టీ నాయకులు ప్రజ శిక్షణతో, రాజకీయ వ్యవహారాలను ఆకళింపుచేసుకొని ప్రజలకు నిజమైన సేవ చేయుటకు తర్ఫీదు పొందుటకు తోడ్పాటు ఇవ్వగలరని తెలియజేశారు.

ఎన్నో త్యాగాలచేసి తెలంగాణా పేద ప్రజలు సాధించుకొన్న భూమిపై పేదలకు హక్కు లేకుండా చేయాలని [illegible] సంజీవరెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రయత్నిస్తున్నారు. ప్రజల కోర్కెలు సాధించడానికి శాసనసభలో జరిగే పోరాటంతోపాటు ప్రజలు తమ తమ సంఘాల ద్వారా పోరాడవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

టీ దుకాణాలపై హెల్తుసిబ్బందిదాడి

నెల్లూరు, ఆగస్టు 10

నెల్లూరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీయుతులు కె. నాగిరెడ్డి భవరాజు గార్ల నాయకత్వాన హెల్తు సిబ్బంది ఈనెల 10 వ తేదీ పోలీసుల సహాయంతో పట్టణమంతా తిరిగి, చిన్న టీ దుకాణములపై బడి ఎట్టి హెచ్చరిక లేకుండా, కొట్టులలో వున్న తిండి వంటలను దౌర్జన్యముగా లాక్కొని పోయినారు. కొన్ని దుకాణములలోని గల్లా పెట్టెలనుండి డబ్బు కూడా తీసుకెళ్ళినట్లు తెలుస్తూంది. పెద్దదుకాణములు, పెద్ద హోటళ్ళ జోలికిపోలేదు.

ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టరు నెల్లూరు క్యాంపులో వున్నపుడే సాయంతో ఈ దర్యాలు చేసినట్లు తెలుస్తుంది. పై దర్యాలకు మూలకారణము ఎన్నికలలో శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డి (చైర్మను) గారి పార్టీకి ఈ చిన్న దుకాణదారులు పని చేయలేదని కక్షేనని దుకాణదారులు [illegible] ప్రజలు అనుకుంటున్నారు. ఈ దౌర్జన్యమునకు నాయకత్వము వహించిన శ్రీ కె. నాగిరెడ్డి (శానిటరీ ఇన్‌స్పెక్టరు) శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి గారికి దగ్గరబంధువు. శ్రీ భవరాజుగారు (శానిటరీ ఇన్‌స్పెక్టర్) మున్సిపల్ కౌన్సిలరైన శ్రీ దువ్వూరు సుబ్రమణ్యంగారి అల్లుడు. వీరు [illegible] దౌర్జన్యాలకు అంతులేదు.

శ్రీ గోలి శేషయ్యకు రు4 వేల బహూకరణ

గుంటూరు, ఆగస్టు 12

సుప్రసిద్ధ చిత్రకారుడు శ్రీ గోలి శేషయ్యకు గుంటూరు పౌరులు నేడు 4 వేల రూపాయలు బహూకరించి సన్మానించారు.

సన్మానసభకు హిందూ కాలేజీ ప్రిన్సిపాలు శ్రీ వల్లభ జోస్యుల సుబ్బారావు అధ్యక్షత వహించారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు సభను ప్రారంభిస్తూ శేషయ్యగారు చిత్రకారులలో ప్రత్యేక ప్రతిభ కలవారని ప్రశంసించారు. శేషయ్యగారి 'శబరి చిత్రం' తన్ను ఎంతగానో ఆకర్షించిందన్నారు.

శ్రీ గోలి శేషయ్యగారు సన్మానానికి కృతజ్ఞత తెలిపి సమాధానమిచ్చారు.

ఒంగోలు తాలూకాలో పాలపొడి ఫ్యాక్టరీ స్థాపించాలి

ఒంగోలు, ఆగస్టు 12

"ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో ఆంధ్రలో స్థాపించనున్న రెండు పాలపొడి ఫ్యాక్టరీలలో ఒకటి ఒంగోలు తాలూకా [illegible], [illegible] ప్రాంతంలో స్థాపించవలసినదిగా" ప్రభుత్వాన్ని కోరుతూ తాలూకా కమ్యూనిస్టు కమిటీ తీర్మానించింది. ఈ సమస్యపై తాలూకాలోని గ్రామసంఘాలు, పంచాయతీలు తీర్మానాలుచేసి జిల్లా మార్కెటింగ్ ఆఫీసరు గారికి పంపవలసినదిగా విజ్ఞప్తి చేసింది.

మాస్కో, ఆగస్టు 13

రాజధానినుండి [illegible] పేరుతో ఒక ఇంగ్లీషు వారపత్రిక ఆగస్టు 15 వ తేదీ నుండి వెలువడబోతున్నది. ప్రఖ్యాత పాత్రికేయుడు శ్రీ ఇ. నారాయణ్ ఈ పత్రికకు సంపాదకులుగా వుంటారు.

శాంతిసభకు వెళ్లిన శాసనసభ్యునికి సన్మానం

పిఠాపురం, ఆగస్టు 10

ప్రపంచ శాంతి మహాసభలో పాల్గొని తిరిగి వచ్చిన శాసనసభ్యుడు శ్రీ దూర్వాసుల వెంకటసుబ్బారావు గారికి పట్టణప్రజలు పెద్దఎత్తున స్వాగత మిచ్చారు. ఆయనను బాండు వాయిద్యాలతో ఊరేగించారు.

తరువాత శ్రీ [illegible] వరహాలరావు అధ్యక్షతన బహిరంగసభ జరిగింది.

ఆర్థికమాంద్యాలు, నిరుద్యోగం మొదలగుసమస్య లెలాంటివో ఎరుగని సోవియట్ రష్యా ప్రజలు సమధికోత్సాహంతో అన్ని రంగాలలోనూ అద్వితీయమైన పురోగతి సాధించారని చూచివచ్చిన విషయాలు శ్రీ దూర్వాసుల వెంకటసుబ్బారావు సోదాహరణంగా శ్రోతలకు వినిపించారు.

గుత్తిలో రైల్వేమెన్స్ ఉత్సవాలు

గుత్తి, ఆగస్టు 10

దక్షిణరైల్వే ఎంప్లాయీస్ యూనియన్ గుత్తి బ్రాంచి ఆధ్వర్యానఅఖిల భారతరైల్వే ఫెడరేషన్ వారంలోతి వైభవంగా జరిగింది. 6 జతలు ఎద్దులతో బండిని అలంకరించి [illegible] వాయిద్యములతో ఊరేగింపుచేశారు. కార్మికులు ఊరేగింపులో కర్రసాము, కత్తిసాము, బండిచక్రములు ఎత్తడం, గుండ్లు ఎత్తడం, మొదలైనవి చేశారు. ఊరేగింపుతో రాత్రి 7 గంటల వరకు రైల్వేకాలనీ అంతా తిరిగి బహిరంగసభ జరిపారు. సభకు శ్రీ కె. యస్. మోహన్ (సి.ఇ.యస్) అధ్యక్షత వహించారు. సహాయ కార్యదర్శి శ్రీ యస్. ఖాజా మొహిద్దీన్, ఉపాధ్యక్షుడు శ్రీ వై. వెంకటప్ప, శ్రీ కమాల్, శ్రీ రంగన్ మొదలగువారు ప్రసంగించారు.

దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్‌ను బలపరచవలెనని, యూనియన్ గుర్తింపుకోసం అందరం పోరాడవలెనని కార్మికులకు ఉపన్యాసకులు విజ్ఞప్తి చేశారు.

అహమ్మదాబాద్ కాల్పులు: ఇంకొకరి మరణం

నాదియాడ్ ప్రాంతంలో 48 గంటల కర్ఫ్యూ విధింపు

అహమ్మదాబాద్, ఆగస్టు 14

అహమ్మదాబాద్‌లో నేడు తిరిగి జనసమూహంపై పోలీసులు తుపాకులు కాల్చారు. ఫలితంగా మరొక వ్యక్తి మరణించాడు. ఈవేళ కూడా నగరంలో పరిస్థితి ఉద్రేకంగానేవుంది. గతరాత్రి నాదియాడ్ పట్టణంలో 48 గంటల కర్ఫ్యూ విధించారు. బరోడాలో మాత్రం పరిస్థితి కొంత మెరుగైనట్లు వార్తలు.

నేడు రిలీఫ్‌రోడ్డుమీదనున్న ఒక బిల్డింగుపై దాడిచేసిన సందర్భంలో జనసమూహాన్ని చెదరగొట్టేందుకై కాల్పులు జరిపామని పోలీసు అధికారులు ప్రకటించారు.

జబరీబాద్, బిలాహాన్నా ప్రాంతాల్లో కూడా పోలీసులు రెండు సార్లు కాల్పులు సాగించారు. వివరాలింకా అందలేదు.

కాళూపూర్ ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న పోలీసులు జనంపై కాల్పులు సాగించగా ఒక వ్యక్తికి తీవ్రమైన గాయాలు తగిలాయి. మరో ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో ఒక స్త్రీ గాయపడిందని కూడా తెలుస్తోంది.

అహమ్మదాబాదుకు 25 మైళ్ళ దూరంలో వున్న నాదియాడ్ పట్టణంలో పోలీసుల కాల్పుల ఫలితంగా ఒక యువకుడు మరణించాడు.

నగరంలో పరిస్థితి నేటి ఉదయం ప్రశాంతంగా కనిపించినా, తర్వాత తిరిగి ఉద్రిక్త పరిస్థితులేర్పడినట్లు తెలుస్తోంది.

ఖాదీ ప్రాంతంలో కర్ఫ్యూ ఉత్తరువుల్ని వుల్లంఘించి ప్రజలు పోలీసు కార్లపై దాడిచేశారు.

అహమ్మదాబాద్ నగరంలో కర్ఫ్యూ పొడిగిస్తూనే వున్నారు.

ఉత్తర, మధ్యగుజరాత్ ప్రాంతాల్లో కూడ ఉద్రిక్తత వ్యాపించినట్లు వార్తలు తెల్పుతున్నాయి.

కాల్పులకు నిరసనగా సూరత్ విద్యార్థుల సమ్మె

అహమ్మదాబాద్ పోలీసు కాల్పులకు నిరసనగా నేడు సూరత్‌లోని కాలేజీల విద్యార్థులు సమ్మెచేశారు. హైస్కూలు విద్యార్థులంతా సమ్మెలో పాల్గొనవలసిందిగా వీరు విజ్ఞప్తిచేశారు. అనేక సెకండరీ పాఠశాలల్లోని బాల బాలికలు కూడా నేడు పాఠశాలలకు పోలేదు. బరోడాలో పరిస్థితి కాస్త మెరుగైనట్లు వార్తలు.

ముఖ్యమంత్రి చావన్ రాక

అహమ్మదాబాద్ పరిస్థితుల్ని స్వయంగా పరిశీలించేనిమిత్తం బొంబాయిరాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై. బి. చావన్ విమానం మీద నేడిక్కడికి వచ్చారు.

'కేరళప్రభుత్వాన్ని ఓడించే శక్తి లేదు'

శ్రీ భవానీసేన్ ఉద్ఘాటన

పాలఘాట్, ఆగస్టు 14

ఎన్ని త్యాగాలకైనా ఓర్చి కేరళ ప్రభుత్వం రాష్ట్రంలో శాంతి భద్రతల్ని నెలకొల్ప నిశ్చయించిందని కమ్యూనిస్టుపార్టీ కార్యవర్గ సభ్యుడు శ్రీ భవానిసేన్ నిన్న యిక్కడ బహిరంగసభలో మాట్లాడుతూ అన్నారు.

ప్రతిపక్షాలు ఎన్ని ప్రతిబంధకాలు కల్పించినా, ఇక ఎట్టి హింసా చర్యలకు ఒడిగట్టినా గట్టిగా ఎదుర్కొనడానికి కేరళ ప్రభుత్వం సిద్ధంగా వుందని ఆయన తెలియజేశారు.

కేరళలోని ప్రతిపక్షాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించాయని, అరాచకత్వానికి, అల్లరులకు ప్రతిపక్షాలు నేడు పెట్టింది పేరని శ్రీ భవానీసేన్ నిశితంగా విమర్శించారు.

ఎన్నుకున్న ప్రజలుతప్ప ప్రస్తుత కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలద్రోయడం ఎవడితరమూ కాదని ఆయన హెచ్చరించారు. ప్రజల సంక్షేమానికి శ్రీ నంబూద్రిపాద్, ఆయన మంత్రివర్గమూ శాయశక్తులా కృషిచేస్తారని ఆయన చెప్పారు.

* * *

బీహార్‌లోని సిక్రహానది పొంగి పొరలినందున చాంపరాన్ జిల్లాలోని పలుప్రాంతాలు నీటమునిగాయి.

కమ్యూనిస్టు ప్రభుత్వానికి అండగా నిలబడండి

కేరళ ప్రజలకు

శ్రీ పి. సి. జోషి విజ్ఞప్తి

ఎర్నాకుళం, ఆగస్టు 13

విద్యా, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో కేరళ కమ్యూనిస్టు మంత్రివర్గం వరుసగా తెస్తున్న శాసనాలను చూసి కాంగ్రెసువారిలో ఒకరకమైన భయాందోళన ప్రారంభమైనట్లు కనబడుతున్నదని కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శులలో ఒకరైన శ్రీ పి. సి. జోషి నేడిక్కడ అన్నారు.

ఇక్కడ జరిగిన పెద్ద బహిరంగ సభలో శ్రీ జోషి ప్రసంగిస్తూ ఇలా అన్నారు :

తాము చేయలేని పనులను కమ్యూనిస్టులు అధికారంలోకివచ్చి చేస్తున్నారని, తత్ఫలితంగా తాము ప్రజల నుండి వేరుపడిపోతామని స్థానిక కాంగ్రెసు నాయకులు కంగారు పడుతున్నారు. పలుకుబడిని కోల్పోయిన వారు చేయవలసిన పని ఇదికాదు. మరల దీక్షతో ప్రజాసేవచేసి ప్రజా విశ్వాసాన్ని చూరగొనడానికి యత్నించాలిగాని, కేరళ వ్యవహారాల్లో కేంద్రం జోక్యంకోసం పనిచేయడం అక్రమం.

కాంగ్రెసు యింతకుముందు తాను చేస్తానని వాగ్దానం చేసిన పనులనే కేరళలో కమ్యూనిస్టు మంత్రివర్గం యిప్పుడు నెరవేరుస్తున్నది. అందువలన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని చట్టవ్యతిరేక, ప్రజాతంత్ర విరుద్ధమైన మార్గాలద్వారా కూలద్రోయడం సమంజసమేనా అన్న విషయాన్ని చిత్తశుద్ధిగల కాంగ్రెసు వాదులంతా ఆలోచించుకోవాలి.

శాంతి భద్రతలను కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. అందువలన ఈ సమస్యలో జోక్యం చేసుకోవడం కేంద్రానికి తగనిపని.

తన శాయశక్తులా ప్రజలకు మంచి చేస్తున్న కమ్యూనిస్టు మంత్రివర్గానికి అన్నివిధాలా అండగా నిలబడవలసిందని కేరళ ప్రజలకు శ్రీ జోషి విజ్ఞప్తి చేశారు.

కమ్యూనిస్ట్‌పార్టీలో చీలికలమాట అబద్ధం

శ్రీ అజయఘోష్ వెల్లడి

తిరువనంతపురం, ఆగస్టు 13

తిరువనంతపురంలో సమావేశమైన కమ్యూనిస్టుపార్టీ కేంద్రకార్యవర్గం తన తీర్మానాలను, నిర్ణయాలను ఏకగ్రీవంగానే చేసిందని నేడిక్కడ పత్రికాగోష్ఠిలో శ్రీ అజయఘోష్ తెలియజేశారు.

పత్రికా విలేఖరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్తూ కమ్యూనిస్టు పార్టీలో చీలికలు వచ్చాయని భావించుతున్నవారు పూర్తిగా ఆశాభంగం పొందుతారన్నారు.

మరొకప్రశ్నకు ఆయన జవాబు చెప్తూ, ఇటీవల కమ్యూనిస్టుపార్టీ నాయకులచే పరస్పర విరుద్ధమైన ప్రకటనలు కొంతవరకు జరిగినమాట వాస్తవమేననీ, ఆ విషయాన్ని కార్యవర్గం గుర్తించినదనీ, ఇంకముందు ప్రజలనూ, పార్టీ కార్యకర్తలనూ కంగారుపరచే విధంగా ప్రకటనలు జరగకుండా జాగ్రత్తపడాలని నిశ్చయించుకొన్నామనీ ఆయన వివరించారు.

మేమంతా కేరళకు బయలుదేరే ముందు కేరళలో అంతర్యుద్ధం జరుగుతున్నదనే వార్తలను పత్రికల్లో చదివాం. తీరా ఇక్కడికి వచ్చిచూస్తే పరిస్థితులన్నీ మామూలుగానే వున్నాయి. ఇతరరాష్ట్రాల్లో వున్నట్లే అభిప్రాయభేదాలూ, ఘర్షణలూ ఇక్కడా వున్నాయి. అంతకుమించినపేూ ప్రత్యేక పరిస్థితి ఏమీలేదు. ప్రతిపక్షాలవారు పనిగట్టుకొని ఎన్ని ఆందోళనలను రెచ్చగొట్టినా, ఎన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టినా ఇంతకు ముందుకంటె కూడా కేరళలో కమ్యూనిస్టుపార్టీ బలంగా వున్నదని నేను అభిప్రాయ పడుతున్నాను.

రాజకీయ పార్టీలు ఒక దానిపట్ల మరొకటి ఎలా వ్యవహరించాలో మొదలుగాగల విషయాలపై ఒక అంగీకారం కుదుర్చుకొనేందుకు అఖిల భారత సమావేశాన్ని జరపడానికైనా తాము సంసిద్ధమని శ్రీ అజయ్ అన్నారు. అవసరమైతే ప్రధానరాజకీయ పార్టీలనాయకులు ఇందుకోసం ప్రాథమిక చర్చలను జరుపుకోవచ్చునన్నారు.

"మీరుకాదన్నా కేంద్రం కేరళ వ్యవహారాలపై దర్యాప్తు జరిపించితే మీ మంత్రివర్గాన్ని రాజీనామా ఇవ్వమని అడుగుతారా?" అని ఒక విలేఖరి ప్రశ్నించగా, ముందు ఏమి చేయబోతామో ఈదశలో నేనేమీ చెప్పలేనని ఆయనన్నారు.

మన రాజ్యాంగంలో కేంద్రానికీ, రాష్ట్రాలకూ గల హక్కులు, విధులు విభజించబడినాయనీ, వాటిని వుల్లంఘించితే ఇంక రాజ్యాంగం అంటూ వుండి ప్రయోజనం ఏముందని శ్రీ అజయ్ అన్నారు.

స్వార్థంకోసం బ్రిటన్, అమెరికాల పన్నాగం

ఐ రా సలో గ్రోమికో విమర్శ

ఐ రా స కార్యాలయం, ఆగస్టు 13

లెబనాన్, జోర్డానులలో సైనిక జోక్యం చేసుకొని అమెరికా, బ్రిటనులు అంతర్జాతీయ న్యాయసూత్రాలనూ, ఐ రా స ప్రణాళికకూ మూలాధారమైన సిద్ధాంతాలనే కాలరాశాయి. భద్రతా సమితి శాశ్వత సభ్యులపైనున్న శాంతి పరిరక్షణ ధర్మాన్ని ఆదేశాలు భంగపరిచాయని సోవియట్ విదేశాంగ మంత్రి గ్రోమికో నేడు ఐ రా స సర్వసభ్య ప్రత్యేక సమావేశంలో ఖండించారు.

ఆయన ప్రసంగ సారాంశం ఇలా ఉంది :

పశ్చిమాసియాలో అమెరికా, బ్రిటనులు తమ సేనలను దించి చాల ప్రమాదకర పరిస్థితిని తెచ్చిపెట్టాయి. ఐ రా స పట్ల ఎక్కడలేని విధేయత నటించే అమెరికా, బ్రిటిష్ నాయకులు ఆచరణలో ఈ సంస్థ పట్ల, దీని ప్రణాళికపట్ల పూర్తి తెగడింపు ప్రదర్శించారు.

బ్రిటన్, అమెరికాల అసలు ఉద్దేశం

పశ్చిమాసియా దేశాల సిరిసంపదలను తమ చేతికింద పెట్టుకొని, అక్కడి ప్రజలపై తమ వలసాధిపత్యాన్ని అమలు జరపడం కోసమే అమెరికా, బ్రిటనులు ఐరాసతో నిమిత్తం లేకుండా ఈ సైనిక జోక్యానికి ఒడిగట్టాయి. దీనిని సమర్థించుకోడానికి ఆ దేశాల నాయకులు ఎన్నెన్నో సాకులు కల్పించారు.

అక్కడ ఐక్య అరబ్ రిపబ్లిక్ జోక్యం చేసుకుంటున్నదని ఒక సాకు చెప్పారు. ఇది అసత్యమని ఐ రా స కార్యదర్శి హామర్‌షెల్డ్ కూడా నిర్ధారించారు.

ఇరాక్ సంఘటనలు తమ సైనిక జోక్యానికి ఒక కారణమని బ్రిటన్, అమెరికాలు అన్నాయి. అలా అంటూనే ఇరాక్ రిపబ్లిక్‌ని గుర్తించాయి. ఐ రా స ప్రణాళికలోని ఆత్మరక్షణనిబంధనను ఈదేశాలనాయకులు ఉదహరిస్తున్నారు. ఆ నిబంధనను నిజంగా అమలుజరుపవలసి వస్తే వీరి దురాక్రమణను ప్రతిఘటించవలసి ఉంటుంది.

సిగ్గుమాలిన చర్య

అమెరికా, బ్రిటనులు ఒడిగట్టినది ఒక సిగ్గుమాలిన చర్య అనే సత్యాన్ని అవి చెబుతూన్న ఏ సాకూ కప్పిపుచ్చజాలదు.

లోగడ కొరియాకు చైనా సహాయం చేసిన సందర్భంలో, దురాక్రమణ అంటే ఒక నిర్వచనాన్ని నిర్ణయించాలని అమెరికా పట్టుబట్టింది. ఆ అమెరికా విదేశాంగమంత్రే దురాక్రమణకు నిర్వచనం వాంఛనీయం కాదని ఇప్పుడంటున్నారు. ఇది ఆకస్మిక సంఘటనేమీ కాదు.

అమెరికా, బ్రిటిష్ గుత్త పెట్టుబడిదారులకు పెట్రోలు దుర్దాహం మరింత పెరిగింది. అందుచేత ఆ రెండు దేశాలూ ఇటీవల అనేక దేశాలపై పరోక్ష దురాక్రమణను సాగిస్తున్నాయి.

శిథిలమయిన వలస పెత్తందారీ వ్యవస్థకు అమెరికా ఇప్పుడు సారథ్యం వహిస్తోంది. బ్రిటన్ అమెరికా లిప్పుడు కలిసి కుట్రలు పన్నుతున్నాయి.

రెండో ప్రపంచ యుద్ధానంతరం సోవియట్ దక్షిణ సరిహద్దుల్ని ఆనుకొని ఉన్న పశ్చిమాసియా దేశాలను తన ఆయుధాగారాలుగామార్చడానికి అమెరికా, బ్రిటనులు ప్రయత్నించాయి. కాని అరబ్బు ప్రజలు దీనిని సాగనివ్వలేదు.

ప్రప్రధాన సమస్య

పశ్చిమాసియా దేశాలకు ఆర్థిక సహాయాన్ని పెంచాలన్న ఐసెన్‌హోవర్ ప్రతిపాదన శ్రద్ధగా పరిశీలించవలసినదే. అయితే, అక్కడనుండి బ్రిటిష్, అమెరికన్ సేనలను వైదొలగించాలనే సమస్య ప్రప్రధానం. ఈఅతి ప్రధాన సమస్యనుండి దృష్టిని మళ్లించడానికే ఈఆర్థిక సహకార ప్రతిపాదనలను తెచ్చిపెడుతున్నారు.

సోవియట్ ప్రతిపాదన

పశ్చిమాసియా దేశాల్లో జోక్యం కలిగించుకోవడాన్ని విసర్జిస్తూ అగ్రరాజ్యాలు ఒక ఒప్పందం చేసుకోవాలని సోవియట్ లోగడచేసిన ప్రతిపాదనను పునరుద్ఘాటిస్తున్నాము. అలాంటి ఒప్పందం ఆరంభంలో శాంతిని పటిష్టపరచడమే కాకుండా, పశ్చిమరాజ్యాలకుకూడా ప్రయోజనకరం కాగలదు. అరబ్బు దేశాలకూ, పశ్చిమ రాజ్యాలకూ మధ్య సుస్థిర సంబంధాలను నెలకొల్పడానికికూడా అది ముఖ్యసాధనం కాగలదు.

బలప్రయోగం లేకుండా, శాంతియుత మార్గాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకొనేందుకు ఒడంబడిక చేసుకోవాలని బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సులకు 1957 లో సోవియట్ సూచించింది. ఇటీవలి సంఘటనల దృష్ట్యా ఈ ప్రతిపాదనల ప్రాముఖ్యాన్ని, ఆవశ్యకతనూ ఎవరైనా శంకించగలరా?

లెబనాన్, జోర్డానుల నుండి అమెరికా, బ్రిటిష్ సేనలను ఏమాత్రము ఆలస్యం లేకుండా, త్వరగా, పూర్తిగా వైదొలగించాలి. ఈ వేళ వీటిలో ఒక పటాలాన్ని వైదొలగించి, దానిని గురించి అమెరికా గొప్పగా చెప్పుకోవడంలో అర్థం లేదు.

ఈ ప్రత్యేక సమావేశం ముందున్న సమస్య మును పెన్నడూ ఎరుగనంతటి ప్రాధాన్యంగలదనీ, దీనిని పరిష్కరించి శాంతిని కాపాడడంలో ఐరాస తన ధర్మాన్ని నిర్వర్తిస్తుందని ఆశిస్తున్నామని గ్రోమికో అన్నారు. బ్రిటిష్, అమెరికా సేనల తక్షణ ఉపసంహరణను గురించిన సోవియట్ తీర్మానాన్ని శ్రద్ధతో పరిశీలించాలనికూడా గ్రోమికో కోరారు.

సింహళ కల్లోలాలలో ముగ్గురు భారతీయుల మరణం

న్యూఢిల్లీ, ఆగస్టు 14

ఇటీవల భాషా వివాదంవల్ల సింహళంలో జరిగిన కొట్లాటలలో ముగ్గురు భారతీయులు మరణించారని, గాయపడ్డవారి సంఖ్య ఎంతో తెలియదని నేడు లోక్‌సభలో పలువురు సభ్యులడిగిన ప్రశ్నలకు విదేశాంగ వ్యవహారాల పార్లమెంటరీ కార్యదర్శి శ్రీ సాదిక్ జవాబు చెప్పారు.

* * *

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో సంస్కృతంలోనూ, అరబిక్ భాషల్లోనూ పండితులైన వారికి నలుగురికి రాష్ట్రపతి యోగ్యతా పత్రాలను ప్రసాదించారు.

పశ్చిమాసియాలో ఐ రా స పోలీస్ దళానికి నెహ్రూ అసమ్మతి

లోక్ సభలో ప్రధాని ప్రసంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 14

పశ్చిమాసియాకు ఐ రా స పోలీస్ దళాన్ని పంపించాలన్న ఐసెన్‌హోవర్ సూచనను భారతదేశం అంగీకరించజాలదని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో తెలియజేశారు.

పశ్చిమాసియాలోని దేశాలపై బలవంతంగా తాటస్థ్యాన్ని రుద్దాలన్న ప్రతిపాదనలకు భారతదేశం పూర్తిగా వ్యతిరేకమని కూడా శ్రీ నెహ్రూ అన్నారు.

'పిల్ల దేశాలని,' 'పసికూనల'ని చెప్పి అగ్రరాజ్యాలవారుఆయా దేశాల పట్ల తామేదో 'సంరక్షణ' బాధ్యత వహిస్తున్నట్లు మాట్లాడుతున్నారు. అవి చిన్నవో ఏమో నాకు తెలియదు కాని తమను వానిసంబంధాల్లోకి పెట్టే సంరక్షకత్వాన్ని ఆ దేశాలు తృణీకరించాయన్న సంగతి, తృణీకరిస్తాయన్న విషయమూ వాస్తవమని శ్రీ నెహ్రూ చెప్పారు.

ఐ రా స పరిశీలక సంఘం

ఇంకా ఇలా అన్నారు :

ఐ రా స పరిశీలక సంఘం మరి కొంతకాలంపాటు తన కార్యకలాపాన్ని కొనసాగించాలి. అవసరమైతే మరికొంతమందిని సాయంగా కూడా తీసుకోవచ్చు.

పశ్చిమాసియాపై ఎట్టి ప్రకటన చేసినా—అది అరబ్ జాతి సుహృద్భావాన్ని, స్నేహ సహకారాల్ని చూరగొనాలి. పశ్చిమ యూరప్ దేశాలు నూనె లేకపోతే బ్రతకలేవు. అటువంటప్పుడు సరసమైన ధరలకు నూనెసప్లయి చేసుకునే విషయంలో అరబ్ దేశాలతో ఒక స్నేహ ఒడంబడిక రావడం కష్టంకాదు. పశ్చిమాసియాలో ప్రచ్ఛన్నయుద్ధం అంతమైనప్పుడే, అన్ని దేశాలు పంచశీలను ఆధారం చేసుకొని పనిచేసినప్పుడే శాంతి స్థాపన జరుగుతుంది.

ఇరాక్‌లో విప్లవం విజయంపొందడంతో పాత ప్రభుత్వ ముద్రలు ప్రజల దృష్టి నుండి అదృశ్యమై పోయాయి.

ఇజ్రాయల్ సమస్య ఏదో విధంగా సంతృప్తికరంగా పరిష్కరించబడందే పశ్చిమాసియాలో నిజమైన శాంతి నెలకొనడం కల్ల. ఈ దేశాలమధ్య సద్భావ సహకారాలు ఉన్నప్పుడే పరస్పర భయాందోళనలన్నీ పోయినప్పుడే [illegible] ఒడంబడికకు అర్థం వుంటుంది.

అయితే ఇజ్రాయల్ సమస్య విషయమై కొంత కాలం వేచి వుండడమే భావ్యం. పశ్చిమాసియా సమస్యలు ఒక కొలిక్కి వచ్చి, ఉద్రిక్తవాతావరణం కొంత చల్లబడేవరకు ఇజ్రాయిల్ [illegible] సమస్యపరిష్కారంకావడం కష్టం.

"ప్రచ్ఛన్న దురాక్రమణ"ను గూర్చి మాట్లాడుతున్నవారు ప్రాథమిక సమస్యల్ని విస్మరిస్తున్నారని కూడా ప్రధాని నెహ్రూ తనప్రసంగంలో విమర్శించారు.

* * *

ఉత్తర ప్రదేశ్‌లో వరదల ఫలితంగా 20 మంది మరణించినట్లు వార్త.

విజయవాడలో రైల్వే విశ్రాంతి భవనాలు

విజయవాడ, ఆగస్టు 15

నేడుదయం డివిజనల్ సూపరింటెండెంటు శ్రీ ఎం. ఎస్. మూర్తిగారు, విజయవాడ రైల్వేస్టేషన్‌లో అదనంగా 2,15,000 రూపాయల ఖర్చుతో కట్టిన ప్రయాణీకుల విశ్రాంతి భవనాలకూ, 1,30,000 రూపాయల ఖర్చుతో నిర్మించిన శాకాహార ఫలహారశాలకూ ప్రారంభోత్సవం చేశారు. ఈ విశ్రాంతి భవనాలలో ఇదివరకు వున్న ఆరు గదులనూ 6 పెద్ద గదులు (2 మంచాలవి) 9 చిన్నగదులు (1 మంచానివి)గా మార్చారు. వీటికి స్నానాల గది, పాయిఖానా అమర్చి అధునాతనంగా తయారు చేశారు. త్వరలోనే రైల్వే ఉద్యోగులకు ప్రత్యేకించి రెండు పెద్దవి, చిన్న తనివారికి ఒక చిన్నదీ, రెండు పెద్దవీ కలవిశ్రాంతిభవనాలనునిర్మిస్తున్నారు.

మంత్రుల ఇళ్లలో దీపపు ఖర్చు కూడాప్రభుత్వమే భరించాలట

ఆంధ్ర శాసనసభలో కొత్తబిల్లు: ప్రతిపక్షాల వ్యతిరేకత

హైదరాబాద్, ఆగస్టు 14

ఆంధ్ర వేతనాల చెల్లింపు అనర్హతల తొలగింపు చట్టాన్ని సవరిస్తూ రెవిన్యూమంత్రి శ్రీ కళా వెంకట్రావు నేడు ఆంధ్ర శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టారు.

మంత్రులు నివసించే యిళ్ళలో విద్యుచ్ఛక్తి నీటి సరఫరాలకు అయ్యే ఖర్చులు, మరమ్మతుల ఖర్చులు ప్రభుత్వం భరించాలని పూర్వపు చట్టంలో లేదు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన సవరణబిల్లు 1956 నవంబరు నుండి ఈ ఖర్చులను చెల్లించడానికి ఉద్దేశించబడింది.

ఈ బిల్లును ప్రతిపక్ష సభ్యులంతా వ్యతిరేకించారు. మంత్రుల యిళ్ళ అద్దె ఎలవెన్సుగా యిచ్చే రు. 250/-లోనే ఖర్చులు కలిసి ఉండేటట్లు మార్చాలని ప్రతిపక్షసభ్యులు సవరణ ప్రతిపాదించారు. కాని వీగిపోయింది. చర్చానంతరం మూజువాణీ ఓటుతో సభవారు బిల్లును ఆమోదించారు.

మంత్రుల ఇళ్ళల్లోనీరు, విద్యుచ్ఛక్తి ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించాలని ఈ బిల్లులో వుంది. చట్టరీత్యా ఈ ఖర్చులను ప్రభుత్వం భరించవలసిన అగత్యం లేకపోయినప్పటికీ, 1956 నవంబరు నుంచి ఇప్పటివరకు వీటిని ప్రభుత్వ ఖాతాలోనే ఖర్చు వ్రాస్తున్నారు. ఆ ఖర్చులన్నింటినీ, 1956 నుంచీ కూడా చట్టసమ్మతం చేయుటానికి ఈ బిల్లులో అవకాశం కల్పించారు.

ఈ బిల్లును సమర్థిస్తూ ఈవేళ ప్రసంగించిన ఏకైక వ్యక్తి శ్రీమతి లక్ష్మీకాంతమ్మ. మంత్రులకు పెద్ద పెద్ద భవనాలుండవలసిన అవసరం కలదని ఆమె చెప్పారు.

శ్రీ కె. ఎల్. నరసింహారావు (కమ్యూనిస్టు-డెమోక్రాట్స్ ఫ్రంటు) మాట్లాడుతూ, మంత్రుల ఇళ్ళ ఖర్చులకోసం వేలకొలది రూపాయలు ఖర్చయి పోతున్నవన్నారు. అద్దె ఇళ్ళల్లో వుంటున్న ప్రజలు నీటిఖర్చు, విద్యుచ్ఛక్తిఖర్చు తామే భరించుతున్నారు. కాని మంత్రులు మాత్రం అద్దె యివ్వకపోగా యితర ఖర్చులను కూడా ప్రభుత్వంమీదనే రుద్దుతున్నారు. మంత్రులు నివసించే ఇళ్ళల్లోని పూలతోటలు పెంపకానికి ప్రభుత్వ సొమ్ము రు.87 వేలు ఖర్చుచేస్తున్నారని ఆయన చెప్పారు.

సోషలిస్టు సభ్యుడు శ్రీ పి. నర్సింగరావుగారు ప్రసంగిస్తూ, మంత్రులకోసం అయిదారు వందల రూపాయలు అద్దె ఇళ్ళను ప్రభుత్వం తీసుకోటం సమర్థనీయంకాదన్నారు. ప్రభుత్వభవనాలువుంటే అద్దెలేకుండా వాటిని మంత్రులకు ఇవ్వటం కొంతవరకు సమర్థనీయం అయితే కావచ్చు; కాని, ఒక్కొక్క మంత్రిగారికోసం నెలకు అయిదారువందల రూపాయలను ఇంటిఅద్దె క్రింద వ్యయంచేయుటం శోచనీయమన్నారు.

శ్రీ జి. యలమందారెడ్డిగారు ప్రసంగిస్తూ, మంత్రుల ఇళ్ళ అద్దె క్రింద నెలకు రు. 250 లు మాత్రమే ఖర్చుచేయ వచ్చునని ఇప్పుడు అమలులోవున్న శాసనం సమ్మతిస్తోందనీ, అయితే, దీనికి విరుద్ధంగా మంత్రుల ఇళ్ళఖర్చులకు నెలకు వెయ్యి రూపాయలు తగలేయుటం హాస్యాస్పదమనీ చెప్పారు.

దేవేంద్ర భవనాలు

మాజీ మంత్రి శ్రీ వేముల కూర్మయ్యగారు మాట్లాడుతూ, మంత్రుల ఇళ్ళ ఖర్చులపై పరిమితి విధించాలన్నారు. ప్రజల సొమ్మును నీళ్ళప్రాయంగా ఖర్చుచేస్తూ మంత్రులు దేవేంద్ర భవనాలలో నివసిస్తున్నారనడం వాస్తవమన్నారు.

తరువాత ఈ బిల్లును సభవారు ఆమోదించారు. అన్ని ఖర్చులతో సహా మంత్రుల ఇళ్ళ అద్దెక్రింద నెలకు 250 రూపాయలకు మించి ఖర్చుచేయరాదంటూ ప్రతిపక్షం ప్రతిపాదించిన సవరణ వీగిపోయింది.

(వి. వి.)

గుజరాత్‌లో ప్రదర్శనలు

(1 వ పేజీ తరువాయి)

జరిగాయని ఇక్కడకు వార్తలు అందాయి.

భావనగర్‌లో విద్యార్థుల సమ్మె

భావనగర్‌లోని విద్యార్థులు నేడు రెండవరోజుకూడా అహమ్మదాబాద్ కాల్పులకు నిరసనగా సమ్మెచేశారు. పట్టణంలోని షాపులన్నింటినీ విద్యార్థులు పనిగట్టుకొని మూయించారు.

పట్టణంలో పోలీసు బందోబస్తు చేయబడింది.

జునాగడ్‌లో కూడా విద్యార్థులు సమ్మెచేశారు. రెండు వందలమంది విద్యార్థులు పట్టణమంతా తిరిగి దుకాణాలను మూసివేయించారు.

భావనగర్ రైల్వేస్టేషన్ వద్దవున్న పోస్టాఫీసు లెటర్‌బాక్సు తెరచి, అందులో వున్న వుత్తరాలన్నిటినీ, కాల్చివేశారనీ, పోస్టాఫీసుపై రాళ్ళు రువ్వారని అధికారులు తెలుపుతున్నట్లు వార్తలు అందాయి.

బ్రోచ్ పట్టణంలో నిషేధాజ్ఞలు జారీ

బ్రోచ్ మునిసిపల్ ప్రాంతంలో నేడు 144 సెక్షన్ క్రింద నిషేధాజ్ఞలను జారీచేశారు. నిన్న [illegible] గుమిగూడి వున్న జన సమూహంపై పోలీసులు కాల్పులు జరిపారు. ముగ్గురు గాయపడినట్లు చెప్తున్నారు.

ప్రజలు రాళ్ళు రువ్వినందున 15 మంది పోలీసులు, ఇద్దరు ఆఫీసర్లు, డిప్యూటీపోలీసు సూపరింటెండెంటు గాయపడినట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

నిన్న మహాగుజరాత్ జనతా పరిషత్ ఆధ్వర్యాన ఒక పెద్ద బహిరంగసభ జరిగింది. అహమ్మదాబాద్‌లో మృతవీరుల స్మారక చిహ్నాలను తొలగించినందుకూ, ప్రజలపై కాల్పులు జరిపించినందుకూ ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించుతూ పలువురు ప్రసంగించారు. ఆసభసందర్భంలోనే ప్రజలకూ పోలీసులకూ సంఘర్షణ జరగడం, పోలీసులు కాల్పడం సంభవించింది.

ఆ తరువాత రాత్రి పట్టణంలో పరిస్థితి ప్రశాంతంగానే వున్నట్లు అధికారులు ప్రకటించారు.

లెబనాన్ తిరుగుబాటు నాయకుని తృణీకారం

బీరుట్, ఆగస్టు 14

లెబనాన్ తిరుగుబాటు నాయకులలో ఒకరయిన సాయిబ్ సలామ్, ఐసెన్‌హోవర్ షట్‌సూత్ర పథకాన్ని తృణీకరిస్తూ నేడొక ప్రకటన చేశారు.

అద్దెకు

ఆఫీసులకు, బ్యాంకులకు బిసెంటు రోడ్డుమీద గల మూడంతస్తుల మేడలో పై రెండంతస్తులు అద్దెకు ఇవ్వబడును.

వివరములకు : టి. వి. రాఘవయ్య,
విజయవాడ-2.

విజయవాడలో

ఇల్లు అమ్మకము

S.R.R. & C.V.R కాలేజీవద్ద గల డా॥ పి. శ్రీనివాసాచారిగారి తాలూకు 480 గజముల స్థలంలో యున్న డాబా యిల్లు విక్రయింపబడును

వివరములకు
యీ క్రిందివారితో సంప్రదించవలెను
N. C. లక్ష్మణాచారి.
హిస్టరీలెక్చరరు, S.R.R & CVR.
కాలేజి, విజయవాడ 13—8—58.





సులేఖ
ఫౌంటెన్ పెన్ సిరా
ప్రపంచంలో మేలైనది
సాల్వెంట్ "S—100" కలిగివున్నది, ఎగుడు దిగుడు వాతావరణంలో, ఖరీదైన పెన్నులలో వాడడానికి ప్రత్యేకంగా తయారు చేయబడింది.
సులేఖ వర్క్స్ లిమిటెడ్.,
కలకత్తా, ఢిల్లీ, బొంబాయి, మద్రాసు.

సంపాదకవర్గం : మోటూరు హనుమంతరావు (అధ్యక్షుడు); కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరి బలరామమూర్తి - ఎడిటర్, ప్రింటర్, & పబ్లిషర్, విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు, విజయవాడ - 2.